Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు సమూలంగా వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :334 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 03 ఏప్రిల్ 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


## తెలంగాణలో భక్తి ఫైట్..



**హైదరాబాద్, ఏప్రిల్ 2:**తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఏ లెవల్‌కు వెళ్లాయంటే.. రేపు పొద్దున ఓటర్లు కూడా ఓటు వేసే ముందు ఏ దేవుడిని నమ్ముతున్నారో చూసుకుని బటన్ నొక్కాల్సి వస్తుందేమో! గత పదేళ్లుగా మన రాష్ట్రాన్ని ఏలిన "వైష్ణవ ప్రియుడు" కేసీఆర్ గారు యాదాద్రిలో నరసింహస్వామిని కోట్లు ఖర్చు పెట్టి కోవెల కట్టిస్తే.. ఇప్పుడు వచ్చిన మన "శివ భక్త" రేవంత్ రెడ్డి గారు మాత్రం "మీరు చక్రం తిప్పితే.. నేను త్రిశూలం తిప్పుతా" అంటూ శైవ నామాలతో రంగంలోకి దిగారు.ఇన్నాళ్లూ కేసీఆర్ గారు చినజీయర్ స్వామి సూచనలతో, ఆగమ శాస్త్రాల లెక్కలతో.. - మిగతా3లో

## ప్రారంభమైన సలేశ్వర జాతర

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**తెలంగాణ అమర్ నాథ్ యాత్రగా ప్రసిద్ధి చెందిన సలేశ్వరం జాతర చైత్ర పౌర్ణమి ప్రారంభమైంది. నల్లమలలో దట్టమైన అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉండే ఇరుకైన లోయ ఇది. ఇక్కడ మూడు రోజుల పాటూ జరిగే ఈ జాతరకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఏడాదికి ఓసారి చెంచులు నిర్వహించే ఊత్సవాన్ని చూసేందుకు భక్తులు పోటీపడతారు. కష్టమైనా కానీ వివిధ ప్రాంతాల నుంచి భారీగా సలేశ్వరం చేరుకుని స్వామిని దర్శించుకుంటారు. అటవీ ప్రాంతం కావడం పులులు ఎక్కువగా తిరిగే ప్రదేశం కావడంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు అటవీ శాఖ అధికారులు. మహబూబ్ నగర్ జిల్ అమ్రాబాద్ మండలం ఫర్హాబాద్ నుంచి పుల్లయపల్లి, రాంపూర్, శ్రీశైలం మార్గంలో - మిగతా3లో



## కొత్తగా 2 లక్షల పెన్షన్లు...



**హైదరాబాద్, ఏప్రిల్ 2:**తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో - మిగతా3లో

## రోజుకు 15 కోట్ల పౌల్ట్రీ వ్యాపారం నష్టం..

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**హైదరాబాద్ మహానగరంలో చికెన్ ప్రియులకు పెద్ద షాక్ తగిలింది. నగరంవ్యాప్తంగా వందలాది చికెన్ షాపులు స్వచ్ఛందంగా మూతపడటంతో మాంసం విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనూ కిటకిటలాడే చికెన్ సెంటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణం రిటైల్ వ్యాపారులకు, హోల్‌సేల్ సరఫరాదారులకు మధ్య తలెత్తిన మార్జిన్ వివాదం . తమకు వస్తున్న లాభం నామమాత్రంగా ఉందని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మార్జిన్ పెంచకపోతే వ్యాపారం చేయలేమని రిటైలర్లు సమ్మెకు దిగారు.ఈ వివాదానికి ప్రధాన కేంద్రం చికెన్ విక్రయాలపై వచ్చే కమిషన్. ప్రస్తుతం బాయిలర్ కంపెనీలు రిటైల్ షాపుల యజమానులకు కిలోకు



కేవలం రూ. 5 నుండి రూ. 7 వరకు మాత్రమే మార్జిన్ ఇస్తున్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, - మిగతా3లో

## మూడు కార్పొరేషన్ల పాలన ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 2:** హైదరాబాద్ మహానగర పరిధిలో వికేంద్రీకృత నగర పాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిని మూడు మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ఫిబ్రవరి 11వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మార్చి 31 వరకు ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలను జీహెచ్ఎంసీ ద్వారానే నిర్వహించారు. అయితే 2026-27 కొత్త ఆర్థిక సంవత్సరం నేటి ప్రారంభం కావడంతో ఎవరికివారే పరిపాలన ప్రారంభించనున్నారు. ఆదాయం, ఖర్చులను సైతం ఎక్కడికక్కడే నిర్వహించనున్నారు.తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) పరిధిలోని 2,053 చదరపు కిలోమీటర్ల పరిధిని ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లను ఏర్పాటు చేసింది. మూడు కార్పొరేషన్ల విభజనలో భాగంగా 689 చదరపు కిలోమీటర్లతో 150 వార్డులతో కూడిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని ఏర్పాటు చేశారు. 70 లక్షల జనాభా ఉందని అధికారులు చెబుతున్నారు.ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, రాజేంద్రనగర్, గోల్కొండ, శంషాబాద్ జోన్లు ఉన్నాయి. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలోని 16 సర్కిళ్లు, 76 వార్డులతో కూడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)గా ఏర్పాటు చేశారు. ఈ కార్పొరేషన్ 613 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. 31.11 లక్షల జనాభా ఉంది. మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లలోని 14 సర్కిళ్లు, 74 వార్డులతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా ఏర్పాటు చేశారు. 654 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 32.52 లక్షల జనాభా ఉందని అధికారులు గుర్తించారు.జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో సుమారు 25 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వీటిలో సుమారు 20 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 31 మార్చి రాత్రి 9 గంటల వరకు రూ.2,501 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు తెలిపారు. మరో రూ.50 కోట్లు వచ్చే అవకాశముందని అధికారుల అంచనా వేస్తున్నారు. మొత్తం రూ.2,550 కోట్లకు పైగా ప్రాపర్టీ ట్యాక్స్ వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు. బుధవారం నుంచి వసూలయ్యే ఎర్లీబర్డ్ స్కీమ్ ట్యాక్స్ వేర్వేరుగా వసూలు చేయనున్నారు.ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధించి 2026-27 సంవత్సరానికి ముందస్తుగా చెల్లించి ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ సృజన, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026--27)కి సంబంధించిన మొత్తం ప్రాపర్టీ టాక్స్‌ను ముందుగానే చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభించనుందన్నారు. గత సంవత్సరాల బకాయిలపై ఈ రాయితీ వర్తించదన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా రూ.548 కోట్లు వసూలయ్యాయి.




## 99 రోజుల కార్యాచరణ సాకారం చేయాలి...

### ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి:సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:**ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు సందేశం అందించారు. "ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు. సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నామని అన్నారు. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు



మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు. ప్రజల జీవితాల్లో - మిగతా3లో

## రాజ్యసభలో బీఆర్ఎస్‌పై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు.



## సంపాదకీయం

# భారత్‌కు ఫుల్ ఎనర్జీ

గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేసింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. చమురు, ఎల్‌పీజీ, ఎల్‌ఎన్‌జీ కొరత ఏర్పడింది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. మరోవైపు భారత్‌లో చమురు కొరత లేకపోయినా ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. దీంతో కేంద్రం గృహ, కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచింది. అయినా ఎల్‌పీజీ సరిపడా లేకపోవడంతో కమర్షియల్ సరఫరా నిలిపివేసింది. తాజాగా ఐదు రోజుల యుద్ధ విమరణ, భారత్ ఇరాన్‌తో జరిపిన చర్చలు, ఇరుదేశాల దౌత్య సంబంధాలతో హార్ముజ్‌లో చిక్కుకున్న భారత నౌకలు భారత్‌కు వస్తున్నాయి. ఈ క్రమంలో భయాలను పటాపంచలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాబోయే 60 రోజులకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి లోటు ఉండదని, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా కూడా యథావిధిగా సాగుతుందని స్పష్టం చేసింది.కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశంలోని ప్రతీ పౌరుడి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వచ్చే 60 రోజులకు సరిపడా స్టాక్ సిద్ధంగా ఉంది. తర్వాతి రెండు నెలలకు అవసరమైన ముడిచమురు దేశానికి చేరుతోంది. హార్ముజ్ జలసంధి మూతపడినా, ఇతర మార్గాల ద్వారా 70% క్రూడాయిల్ సరఫరా కొనసాగుతోంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ దిగుమతికి ఏర్పాట్లు జరిగాయి. వచ్చే నెల రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.ఇరాన్ యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి వద్ద ప్రతికూల పరిస్థితులు ఉన్నా, భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న 41కి పైగా దేశాల నుంచి క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఇంతకు ముందు హార్ముజ్ ద్వారా వచ్చిన దానికంటే ఎక్కువ ముడిచమురు ఇప్పుడు ఇతర మార్గాల్లో వస్తోంది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) వంధశాతం కన్నా ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి.గ్యాస్ కొరత వస్తుందనే భయంతో ప్రజలు ముందే బుక్ చేసుకోవడం వల్ల తలెత్తింది. గత కొన్ని రోజులుగా డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక ఆలస్యం జరిగినా, సరఫరా వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేస్తోంది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ధ్రువీకరించింద భారత్ ఇంధన భద్రత కోసం 85 శాతం క్రూడ్ ఆయిల్ దిగుమతిని 41కిపైగా దేశాల నుంచి కొనసాగిస్తోంది. రిఫైనరీలన్నీ వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. మరోవైపు 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి వస్తోంది. దీంతో పెట్రోల్ 60 రోజులకు, డీజిల్ 90 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి.ప్రపంచంలో ఏం జరిగినా భారత ఇంధన భద్రతకు లోటు లేదని కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమాసియా యుద్ధ కారణంగా ఇంధన సంక్షోభం ఏర్పడింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు భారత్ కూడా ఇబ్బంది పడుతోంది. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎల్‌ఎన్‌జీ ఇబ్బందులు తలెత్తాయి. ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో చమురు రవాణా ఆగిపోయింది. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం ఈ సంధి గుండానే వస్తుంది. యుద్ధం ఇంకా పెరిగి జలసంధి పూర్తిగా మూసివేస్తే చమురు రవాణా పూర్తిగా నిలిచిపోతుంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్లాన్ బి సిద్ధం చేస్తోంది.ఏప్రిల్ నెలకు 6 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును రష్యా నుంచి దిగుమతి చేస్తూ భారత్ కొత్త ఒప్పందాలు ఖరారు. అమెరికా మినహాయింపుతో (30 రోజులు) తక్కువ ధరలకు సరఫరా భద్రపరుస్తోంది, ఇది దేశ ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. దేశంలో 33 లక్షల టన్నులు పైగా చమురు, మార్కెటింగ్ కంపెనీలతో కలిపి 74 రోజుల అవసరానికి సరిపోయే స్టాక్ సిద్ధంగా ఉంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది33 కోట్ల కుటుంబాలకు వంటగ్యాస్ అందేలా దేశీయ ఉత్పత్తి 25 శాతం పెంచారు. హోటళ్లు మూతలు, అధిక కొనుగోళ్లకు ప్రజలు ఆందోళన చెందకుండా పర్యవేక్షణ పెంచారు. చమురు దిగుమతి చేసుకునే దేశాల సంఖ్యను కూడా 27 నుంచి 41 దేశాలకు విస్తరించింది. సౌదీ, యూఏఈ పైప్‌లైన్లు, అమెరికా మార్గాలు ప్రత్యామ్నాయాలుగా పనిచేస్తున్నాయి. పీఎన్‌జీ విస్తరణకు ఆదేశాలు జారీ చేసింది.ప్లాన్ బీ వల్ల ఇంధన ధరలు అదుపులో ఉంటాయి. ఆర్థిక స్థిరత్వం కాపాడుకుంటుంది. రష్యా ఆధారం పెరగడం అమెరికా సంబంధాలకు సవాల్. కానీ, దౌత్య నైపుణ్యంతో భారత్ భద్రత పటిష్టం అవుతోంది. భవిష్యత్తులో వైవిధ్యీకరణ దీర్ఘకాల రక్షణగా మారుతుంది. వ్యూహాత్మక నిల్వలు, వైవిధ్యీకృత దిగుమతి మార్గాలు, పూర్తి సామర్థ్యంతో నడుస్తున్న రిఫైనరీలు దేశాన్ని ఇంధన సంక్షోభం నుంచి కాపాడుతున్నాయి. ప్రజలు ధైర్యంగా ఉండి, పుకార్లకు భయపడకుండా సాధారణ వినియోగం కొనసాగించాలి.

## 35 ఏళ్ల తర్వాత

# అప్పుడు జయలలిత .. ఇప్పుడు విజయ్



**చెన్నై, ఏప్రిల్ 2:**తమిళనాడు అసెంబ్లీలో దళపతి విజయ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఒంటరిగానే పోటీచేస్తున్న తమిళగ వెట్రి కళగం ఏ మేరకు ప్రభావం చూపుతుందో మే 4న తేలిపోనుంది. ఈ ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల నుంచి బరిలో దిగారు. 35 ఏళ్ల తర్వాత ఇలా ఒకే అభ్యర్థి తమిళనాడు ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయడం గమనార్హం. గతంలో అన్నాడీఎంకే అధినేత్రి దివంగత జయలలిత మాత్రమే రెండు చోట్ల పోటీచేసి గెలిచారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే చీఫ్, దళపతి విజయ్ ఒంటరిగా దిగి సాహసం చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ శాసనసభ స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగుతున్నారు. తొలి అడుగులో రాజకీయ స్థిరత్వం కోసం వ్యూహాత్మకంగా విజయ్ అడుగులు వేస్తున్నారు. భారీగా ఉన్న అభిమానగణం ఆయనకు ఓటు బ్యాంకుగా మారతారా? అనే సందేహం అందరిలోనూ ఉంది. అందుకే ఒకచోట ఓడిపోయినా మరోచోట గెలుపు సాధ్యమనే ధీమాతోనే రెండు స్థానాలను ఎంచుకున్నట్టు తెలుస్తోంది. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత తర్వాత రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతున్న నేతగా విజయ్ గుర్తింపు పొందారు. తమిళనాడు అసెంబ్లీకి మొత్తం 234 స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఒక అభ్యర్థి ఒకేసారి రెండు స్థానాల నుంచి పోటీ చేయొచ్చు. ఆ రెండు చోట్లా గెలిస్తే ఏదో ఒక దానికి మాత్రం రాజీనామా చేయాలి. 1991 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బర్గూర్, కాంగేయం నుంచి పోటీచేసిన జయలలిత .. రెండింటిలోనూ విజయం సాధించారు. దీంతో కాంగేయం సీటును వదులుకుని బర్గూర్ ఎమ్మెల్యేగా అమ్మ కొనసాగారు. సరిగ్గా మూడున్నర దశాబ్దాల తర్వాత రెండు అసెంబ్లీ స్థానాల నుంచి విజయ్ బరిలోకి దిగుతుండటం గమనార్హం. ఈ ఎన్నికల్లో తనకు, అధికార డీఎంకే మధ్యనే పోటీ జరుగుతుందని విజయ్ ప్రకటించారు. ఇక, అన్ని రాజకీయ పార్టీల మాదిరిగానే టీవీకే సైతం ప్రజాకర్షక హామీలను ప్రకటించింది. 2001 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనలను ఉల్లంఘించేలా ఏకంగా నాలుగు చోట్ల జయలలిత నామినేషన్ దాఖలు చేశారు. కృష్ణగిరి, భువనగిరి, ఆండిపట్టి, పుదుకోట్టై నుంచి పోటీకి సిద్ధమయ్యారు. కానీ, టాన్సీ భూముల కేసులో ఆమె దోషిగా నిర్ధారణ అయి శిక్ష ఖరారు కావడంతో నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే, 2006 ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి డీఎండీకే అధ్యక్షుడు, కెప్టెన్ విజయకాంత్ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఆయన కేవలం విరుదునగర్ నుంచి మాత్రమే పోటీచేసి విజయాన్ని అందుకున్నారు.

# 50 రోజులు జైల్లో, 25 రోజులు హోటల్‌లో..

## ఇరాన్ నుంచి క్షేమంగా స్వదేశానికి 8 మంది భారతీయులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**అమెరికా–ఇజ్రాయెల్ దాడికి ముందు రోజు ఇరాన్ జైలు నుంచి విడుదలైన 10 మంది భారతీయ నావికులు.. యుద్ధ భూమిలో చిక్కుకున్నారు. వారు బయలుదేరాల్సిన రోజనే యుద్ధం మొదలైంది. దీంతో తాము బసచేసిన హోటల్‌లోనే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని గడిపారు. బాంబులు, క్షిపణులు మోత మధ్య గడిపిన భారతీయులు.. చివరకు అర్మేనియా సరిహద్దులకు వచ్చి.. రెండు రోజుల కిందట భారత్‌కు చేరుకున్నారు. వారు తమకు ఎదురైన భయానక అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు.గతేడాది డిసెంబరులో అక్రమంగా చమురు తరలిస్తున్నారనే ఆరోపణలతో భారతీయ సిబ్బంది ఉన్న దుబాయ్ ఆయిల్ ట్యాంకర్ ఇరాన్ నౌకాదళం స్వాధీనం చేసుకుంది. అందులోని 10 మంది భారతీయ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, మిగతావారిని నౌకలో ఉంచింది. వీరు జైల్లో 50 రోజులు ఉండి ఫిబ్రవరి 27న విడుదలయ్యారు. ఆ మర్నాడు స్వదేశానికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. అదే రోజు ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించడంతో ప్లాన్ మొత్తం అడ్డం తిరిగింది. ఇరాన్ నుంచి బయటపడే మార్గం లేకపోవడంతో 25 రోజుల పాటు హోటల్‌లో ఉండి.. చివరకు క్షేమంగా 8 మంది సోమవారం స్వదేశానికి చేరుకున్నారు.మీరట్‌కు చెందిన విజయ్ కుమార్, ఘజియాబాద్‌కు చెందిన కేతన్ మెహతా అనే ఇంజినీర్లు ఇందులో ఉన్నారు. తాము జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ హోటల్‌లో దిగామని, యుద్ధం ఇంత తీవ్రమవుతుందని అనుకోలేదని మెహతా అన్నారు. "మేము జైలు నుంచి బయటకు వచ్చి ఒక హోటల్‌లో బస చేసినప్పుడు, యుద్ధం రాబోతోందని మాకు ఏమాత్రం తెలియదు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్‌లు మరుసటి రోజే యుద్ధం మొదలుపెట్టాయి. మేము పూర్తిగా నిశ్చేష్టులయ్యాం.. అన్నీ మూతపడ్డాయి–విమానాశ్రయం కూడా మూసేశారు" అని అన్నారు. అమెరికా– ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్న ఇరాన్ నావికాదళ ప్రధాన స్థావరం బందర్ అబ్బాస్ పట్టణానికి తాను బసచేసిన హోటల్ కేవలం 600–700 మీటర్ల దూరంలో ఉందని చెప్పాడు.'మేము రాయబార కార్యాలయాన్ని సంప్రదించడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హోటల్ నుంచి బయటకు అడుగు పెట్టవద్దని మాకు సూచించారు. రోజురోజుకూ, మేము బాంబులు, క్షిపణుల శబ్దాలు ఎక్కువయ్యాయి.. మేము కిటికీలు తెరిచి చూస్తే మా కళ్ల ముందే క్షిపణులు వర్షంలా కురిసేవి.. రోజుకు 100 నుంచి 200 వరకు బాంబు పడేవి.. బందర్ అబ్బాస్ నుంచి 1,800 కిలోమీటర్ల దూరంలోని అర్మేనియా సరిహద్దుకు బస్సులో 18 నుంచి 19 గంటలు ప్రయాణించి చేరుకున్నాం.. ఈ సమయంలో బాంబుల మోత మోగుతూనే ఉంది.. " అని తెలిపాడు. భారత రాయబార కార్యాలయం అధికారులు తమతో నిరంతరం సంప్రదిస్తూనే ఉన్నారని మెహతా అన్నాడు.దుబాయ్ కంపెనీ ప్రైమ్ ట్యాంకర్స్ ఎల్‌ఎల్సీ ఆధ్వరంలోని ఎంటీ వలియంట్ రోర్ ఆయిల్ ట్యాంకర్‌ను అంతర్జాతీయ జలాల్లో అక్రమంగా చమురు తరలిస్తున్నారని ఆరోపిస్తూ డిసెంబరు 8న ఇరాన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కానీ, ఈ ఆరోపణలను సదరు కంపెనీ తోసిపుచ్చింది. నౌకలోని క్రూ సిబ్బంది పది మందిని బందర్ అబ్బాస్ జైలుకు తరలించిన 10 మందిని కాన్సులర్ పద్ధతిలో కలిసేందుకు తమకు అనుమతి లభించిందని విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వీరిలో 16 మంది భారతీయులు, ఒకరు శ్రీలంక, బంగ్లాదేశ్‌కు చెందిన పౌరులు

# బెంగాల్ లో కాంగ్రెస్ ఒంటరి పోరు

**కోల్ కత్తా, ఏప్రిల్ 2:**పశ్చిమ బెంగాల్ రాజకీయ ముఖచిత్రం ఎన్నికల వేళ మరింత ఆసక్తికరంగా మారుతోంది. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య ప్రధానంగా పోరు నెలకొన్న ఈ రాష్ట్రంలో.. మొత్తం 294 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించాలని కాంగ్రెస్ అధిష్ఠానం అధికారికంగా తీర్మానించింది.అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాల ఖరారుపై ఢిల్లీలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. ఈ అత్యున్నత స్థాయి భేటీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ సహా పలువురు ముఖ్య సీనియర్ నాయకులు పాల్గొన్నారు. బెంగాల్‌లోనిక్షేత్రస్థాయి పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అవకాశాలపై నాయకులు కూలంకషంగా చర్చించారు.కాంగ్రెస్ పార్టీ తాజా నిర్ణయంతో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఒంటరిగా పోటీ చేయాలన్న నిర్ణయానికి ఆశావహుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏఐసీసీ పశ్చిమ బెంగాల్ ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. "మా పార్టీ రాష్ట్రంలోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాల్లోనూ పూర్తి స్థాయిలో పోటీ చేస్తుంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణుల నుంచి ఏకంగా 2,500 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. సీఈసీ సమావేశంలో ఈ దరఖాస్తులన్నింటిపైనా లోతుగా సమీక్షించాం. త్వరలోనే తుది జాబితాను ప్రకటిస్తాం" అని స్పష్టం చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేసిన కాంగ్రెస్.. ఈసారి స్వతంత్రంగా అదృష్టాన్ని పరీక్షించుకోనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. సగటున ఒక్కో నియోజకవర్గానికి 8 నుంచి 9 మంది నాయకులు పోటీ పడుతుండటం పార్టీ కేడర్‌లో పెరుగుతున్న ఉత్సాహానికి అద్దం పడుతోంది. దశాబ్దాలుగా బెంగాల్‌లో



కోల్పోయిన తమ పాత ఓటు బ్యాంకును తిరిగి సొంతం చేసుకోవడంతో పాటు, రాష్ట్రంలో పార్టీ పునాదులను స్వతంత్రంగా బలోపేతం చేసుకోవడానికే కాంగ్రెస్ ఈ వ్యూహాత్మక అడుగు వేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడంతో కాంగ్రెస్ ప్రచార పర్వం ఇక ఊపందుకోనుంది.

# ఇంటి ముందు దీపాలు వెలిగించండి

**విజయవాడ, ఏప్రిల్ 2:** చంద్రబాబు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాజధాని అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న మద్దతు, గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక పిలుపునిచ్చారు. "అమరావతికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు దీపాలు వెలిగించాలి" అని సూచించారు. ఇది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, రాజధాని పట్ల ప్రజల నిబద్ధతను, కేంద్ర ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతను తెలియజేసే ఒక సంకేతమని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మధ్యాహ్నం ఆయన ఉద్దండరాయునిపాలెం వెళ్లనున్నారు. ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యత ఉంది. సరిగ్గా 2015లో ఇదే ప్రాంతంలో అమరావతి రాజధాని నగరానికి అత్యంత వైభవంగా శంకుస్థాపన జరిగింది. ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీ అదే స్ఫూర్తిని నింపేందుకు సీఎం అక్కడ పర్యటించనున్నారు. అదే విధంగా సాయంత్రం వేళల్లో రాష్ట్రవ్యాప్త దీపోత్సవం జరగనుంది.అమరావతి అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఐదేళ్లుగా ఒక పెద్ద వివాదంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం' మూడు రాజధానుల ప్రతిపాదనను తీసుకురావడంతో అమరావతి నిర్మాణం



పూర్తిగా స్తంభించిపోయింది. మొన్న జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత, అమరావతిని ఏకైక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు చట్టసవరణ కూడా చేసి అమరావతి ఏకైక రాజధాని అని పార్లమెంట్‌లో చట్టం తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అమరావతికి, భూములు ఇచ్చిన రైతులకు అండగా నిలబడి మద్దతు ప్రకటించింది. అందుకే కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల్లో రాజధాని పట్ల నమ్మకాన్ని పెంచడానికి ఈ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దీపోత్సవం కేవలం రాజధాని ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని 26జిల్లాల్లోని ప్రతి గ్రామంలోనూ నిర్వహించాలని ఎన్డీఏ నేతలు నిర్ణయించారు. ఇందులో పార్టీ కార్యకర్తలు, ప్రజలు భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. ఉద్దండరాయునిపాలెం పర్యటనలో ఆయన అక్కడ ఉన్న ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి, నిర్మాణ పనులు ఎప్పటి నుంచి వేగవంతం చేయాలో అధికారులకు సూచనలు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సమావేశంలో వైసీపీ అధినేత జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజలు తిరస్కరించినప్పటికీ జగన్ తీరులో మార్పు రాలేదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధాని ప్రాజెక్టును నాశనం చేశారని అన్నారు. ఆ గాయాలు మాన్పే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ఇతర ప్రాంతాల్లో చిచ్చు పెట్టేందుకు అర్థంపర్థం లేని ప్రతిపాదనలు తీసుకొస్తున్నారని అన్నారు.అమరావతి పేరు పలకడానికి జగన్‌కు ఇష్టం లేదని చంద్రబాబు విమర్శించారు. అందుకే కొత్త కొత్త వింతైన పేర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి ఏర్పాటుతో ఏ ప్రాంతానికి అన్యాయం జరగదని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటికే విశాఖలో ప్రపంచస్థాయి సంస్థలు తీసుకొస్తున్నామని వివరించారు. రాయలసీమలో కూడా పరిశ్రమలు తెచ్చామన్నారు. కర్నూలులో వీలైనంత త్వరగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

# రాజ్యాంగేతర శక్తిగా ఐఏఎస్...

**హైదరాబాద్, ఏప్రిల్ 2:** సాధారణంగా మనం రాజకీయ నాయకులను అత్యంత శక్తివంతులైన వారిగా భావిస్తుంటాం.. వారు తలచుకుంటే ఏదైనా చేయగలరని అనుకుంటాం. కానీ రాజకీయ నాయకులను మించిపోతున్నారు నేటి కాలంలో అధికారులు. ముఖ్యంగా కొంతమంది బ్యూరో క్రాట్ లు సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నారు. గతంలో ఇలా ఉండేది కాదు. ఇప్పుడు రాజకీయ నాయకులకు సంపాదన మీద విపరీతమైన యావ పుట్టింది కాబట్టి.. అక్రమ అర్జనకు అధికారుల అండ కావాలి కాబట్టి.. అటువంటి అధికారులు తమకు తాముగా స్వీయ శక్తిని పెంచుకొని వ్యవస్థలకు మించి ఎదుగుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఓ మంత్రి కుటుంబ సభ్యులు హైదరాబాద్ నగర శివారులో ఓ గ్రామంలో భూముల కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఆ భూములను ఇవ్వకపోతే వారిని అంతం చేస్తారని బెదిరించినట్టు వార్తలు వినిపించాయి. వారికి ప్రతిపక్ష పార్టీ అండగా నిలిచింది. వారు ఇచ్చిన ఆధారాలను విలేకరుల ఎదుట ప్రదర్శించింది. ఆ మంత్రి కుమారుడు.. బంధువులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.. ఈ నేపథ్యంలో ఆ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు ఓ ఐఏఎస్ అధికారి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆ అధికారి మంత్రి కుటుంబ సభ్యులతో మిలాఖత్ అయ్యారని..



ఆయన అండదండలతోనే మంత్రి కుటుంబ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు.. ఆ అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆ అధికారి పేరును పదేపదే ప్రస్తావించిన నేపథ్యంలో.. ఆయన గురించి విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఇప్పటి అధికార పార్టీలోనే కాదు.. గత అధికార పార్టీలోనూ ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి ముఖ్య భూమిక పోషించారు. నాడు ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులో ఆ ఐఏఎస్ అధికారి తనకు అనుకూలంగా నిబంధనలు మార్చారు. భూములను మొత్తం నచ్చిన వాళ్లకు కట్టబెట్టారు. ఏళ్ల తరబడి ఆయన అదే పోస్టులో ఉన్నారు.. ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం మాత్రమే కాదు.. సొంత ఆస్తులను విపరీతంగా పెంచుకున్నారు.. అప్పట్లో ఓ రాజకీయ పార్టీకి ఆ అధికారి భారీగా విరాళం కూడా ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి.నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ అధికారి రెవెన్యూ విభాగంలో కింగ్ పిన్ మాదిరిగా వ్యవహరించాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆయన అదే శాఖలో కొనసాగుతున్నాడు. అంతేకాదు అంతకుమించి అనే స్థాయిలో దోపిడికి పాల్పడుతున్నాడు. సదరు అధికారి గురించి ఇటీవల ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన కీలక నాయకుడు చేసిన ఆరోపణలు నూటికి నూరు శాతం నిజం. కాకపోతే, ఆ ప్రతిపక్ష నాయకుడు తెలంగాణ ప్రభుత్వంలో షాడో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా..ఆ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నాడు ఆ అధికారితో సదరు కీలక ప్రతిపక్ష నాయకుడు చెట్టా పట్టాలు వేసుకొని తిరిగాడు. దీనినిబట్టి అధికారం ఉన్నప్పుడు ఒక విధంగా.. అధికారం లేనప్పుడు మరొక విధంగా మాట్లాడటం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిందనే సందర్భాన్ని మనం ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

# ఒరాకిల్ లో ఏం జరుగుతోంది

**హైదరాబాద్, ఏప్రిల్ 2:** టెక్ దిగ్గజం ఒరాకిల్ ఒకేసారి 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఊచకోత రాబోయే రోజుల్లోనూ కొనసాగనున్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామం ఇప్పుడు భారతదేశంలోని టెక్ హబ్?లలో కొత్త భయాందోళనలు రేకెత్తిస్తోంది. కంపెనీలు అనుసరిస్తున్న లేఆఫ్ ల కారణంగా ఐటీ నిపుణులు తమ భారీ పెట్టుబడులను పున:సమీక్షించుకుంటున్నారని తద్వారా రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.రెండు దశాబ్దాలుగా భారత్?లో నెక్స్ట్ లెవల్ గా దూసుకుపోయిన భారత ఐటీ సెక్టార్ వృద్ధి వేగంగా ఇటీవల నెలకొన్న పరిణామలతో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఒరాకిల్ ఇండియా తరహా పరిణామాలు ఇతర కంపెనీల్లోనూ కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే దేశంలోని ఐటీ నగరాలపై తీవ్ర ప్రభావం పడబోతున్నట్లు తెలుస్తోంది. ఐటీ రంగంలో వచ్చిన ఆదాయం ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్ , పూణే, ఎన్ సీఆర్ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం బలపడటాని వెన్నెముకగా నిలిచింది. కానీ తాజా లే ఆఫ్ లతో ఈ పరిస్థితులు తారుమారు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో భారీ ధరలు పెట్టి ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన సాఫ్ట్వేర్ ఉద్యోగులు.. ఇప్పుడు తమ ఈఎంఐలను చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు రేపు తమకు కూడా ఇదే పరిస్థితి రావొచ్చనే భయంతో తమ నిర్ణయాలను వాయిదా వేసుకునే అవకాశాలు ఉండనుంది.ఐటీ రంగంలో వస్తున్న పెనుమార్పులు ఇప్పుడు సామాన్యుడి సొంతింటి కలపై కోలుకోలేని దెబ్బ తీస్తుండగా ఏఐ ప్రభావం ఐటీ రంగాన్ని మరింత ఆందోళనలోకి నెట్టుతోంది. ఆటోమేషన్ వల్ల ఐటీ కంపెనీల రాబడిలో 2 నుంచి 3 శాతం తగ్గుదల ఉండవచ్చని ఐసీఐసీఐ డైరెక్ట్ అంచనా వేసింది. 2026లో ఇప్పటివరకు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 25 శాతం పడిపోయింది. గతంలో అమెరికా డెవలపర్ల కంటే భారతీయ డెవలపర్లు తక్కువ శాలరీలకే లభిస్తారనే ఆలోచనలతో ఐటీ కంపెనీలు నడిచాయి. కానీ ఇప్పుడు~ా× కోడింగ్ ఏజెంట్లు విద్యుత్ ఖర్చుతోనే పని పూర్తి




చేస్తున్నాయి. దీనివల్ల టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి దిగ్గజాలకు ముప్పు పొంచి ఉందని 'సిట్రిని రీసెర్చ్' నివేదిక హెచ్చరించింది. దీంతో రాబోయే రోజుల్లో ఐటీ సెక్టార్ ఎలా ఉండబోతోంది? తద్వారా ఆ రంగంలోని ప్రభావం ఇతర రంగాలపై ఎలా పడబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది.

## బొగ్గు స్మగ్లింగ్ కేసులో

# కీలక పరిణామం...

**ఐప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులు!**

**కోల్ కత్తా , ఏప్రిల్ 2:** పశ్చిమ బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాజకీయ సలహా సంస్థ ఐప్యాక్ కార్యాలయాలపై దాడులు చేసింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలలో ఈ దాడులు జరుగుతున్నాయి. బెంగళూరులో, కంపెనీ సహ వ్యవస్థాపకుడైన రిషిరాజ్ సింగ్ కార్యాలయంలోనే ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఐప్యాక్ వ్యవస్థాపకులు రిషిరాజ్ సింగ్, ప్రతీక్ శర్మ, వినీష్ చందాకు చెందిన కార్యాలయాలు, నివాసాల్లో జుణ అధికారులు సోదాలు చేస్తున్నారు.దర్యాప్తు సంస్థ ఈడీ ఈ ఏడాది జనవరిలో కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయాలపై దాడి చేసింది. ఈ దాడిపై ఆ సంస్థ ఒక ప్రకటనలో, "ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో, సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఐప్యాక్ వంటి వృత్తిపరమైన సంస్థకు ఇది ఒక కష్టమైన, దురదృష్టకరమైన రోజు" అని పేర్కొంది.ఇదిలావుంటే, ఐపాక్ సంస్థ, భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్), జనతా దళ్ (యునైటెడ్), శివసేన వంటి అనేక రాజకీయ పార్టీలకు వృత్తిపరమైన, సిద్ధాంతపరమైన సలహాదారుగా పనిచేసింది.ఐప్యాక్‌పై ఈడీ దాడులు రాజకీయ దుమారాన్ని రేకెత్తించాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ దాడులలో జోక్యం చేసుకున్నారని, పోలీసుల సహాయంతో డిజిటల్ పరికరాలు, ముఖ్యమైన పత్రాలను తొలగించి, ఏమీ స్వాధీనం చేసుకోకుండానే సోదాలను నిలిపివేయమని అధికారులపై ఒత్తిడి తెచ్చారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది.తాజాగా బొగ్గు స్మగ్లింగ్ ద్వారా వచ్చిన సుమారు రూ. 20 కోట్ల హవాలా నిధులను ఐప్యాక్‌కు పంపినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేర్కొంది. స్వాధీనం చేసుకున్న డేటాను తారుమారు చేయకుండా రక్షణ కల్పించడం, తమ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్ నుండి ఉపశమనం కల్పించడంతో సహా పలు రక్షణ కల్పించాలని కోర్టును కోరింది.

# 99 రోజుల కార్యాచరణ సాకారం చేయాలి..

- మొదటి పేజీ తరువాయి

స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగుతోంది. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి – ఉచిత బస్సు సౌకర్యం, ? 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ



ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలని అన్నారు. "తెలంగాణ రైజింగ్ -- 2047" విజన్తో ఆర్థికంగానే కాకుండా, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్, ప్యూర్, రేర్ గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలని అన్నారు.

# కొత్తగా 2 లక్షల పెన్షన్లు...

- మొదటి పేజీ తరువాయి

అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా,



ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

## తెలంగాణలో భక్తి ఫైట్..

- మొదటి పేజీ తరువాయి

ఎక్కడ చూసినా 'గోవిందా గోవిందా' అనిపించారు. కానీ భద్రాచలం రామయ్యను మాత్రం ఎందుకో కాస్త లైట్ తీసుకున్నారు. అక్కడే మన రేవంత్ అన్నకు రూట్ దొరికింది. "కేసీఆర్ గారు రాముడిని మర్చిపోతే.. నేను రాముడికి పట్టువస్త్రాలు ఇస్తూనే, శివుడితో సెల్ఫీలు దిగుతా" అన్నట్లుగా ఆయన ప్లాన్ మార్చేశారు.ఢిల్లీలో రాహుల్ గాంధీ గారు అప్పుడప్పుడు "నేను శివ భక్తుడిని" అని ఫోజులు ఇస్తుంటే ఇక్కడ రేవంత్ రెడ్డి గారు ఆ లైన్ గట్టిగా పట్టేశారు. కేసీఆర్ వేములవాడ రాజన్నకు రూ. 100 కోట్లు ఇస్తానని చెప్పి 'సారీ.. మర్చిపోయా' అంటే.. రేవంత్ రెడ్డి గారు మాత్రం "రాజన్నకు నిధులిస్తా.. మూసీ గట్టున వంద అడుగుల శివుడిని నిలబెడతా" అని శివతాండవం చేస్తున్నారు. మొత్తానికి పాత పాలనలో 'విష్ణువు' హైలైట్ అయితే కొత్త పాలనలో 'పరమశివుడు' ట్రెండింగ్‌లో ఉన్నారన్నమాట!అసలు ఇక్కడ డౌట్ ఏంటంటే.. వీరికి భక్తి పెరిగిందా? లేక దేవుళ్లని కూడా విభజించి ఓట్లు దండుకోవాలని ఉందా? కేసీఆర్ మార్క్ భారీ గోపురాలు, శిల్ప కళలు, వైష్ణవ ఆడంబరం కనిపిస్తోంది. ఇక రేవంత్ మార్క్ సాదాసీదా శివ భక్తి, శైవ క్షేత్రాల డెవలప్‌మెంట్, 'జై భోలో' నినాదాలు వినిపిస్తున్నాయి.ఒకరు గాలిలో చక్రం తిప్పాలని చూస్తే, మరొకరు నిప్పు కన్ను తెరుస్తానని హింట్లు ఇస్తున్నారు. కానీ పాపం జనం మాత్రం.. "అయ్యా.. మీరు వైష్ణవమో, శైవమో మాకు అనవసరం.. మాకు కొంచెం వర్షాలు కురిపించి, రోడ్లు వేయించి, మా బతుకులు బాగు చేస్తే ఏ దేవుడైనా ఒక్కటే!" అని ముక్కున వేలేసుకుంటున్నారు.రాజకీయ నాయకుల భక్తి ఎప్పుడూ 'సీజనల్' వ్యాధి లాంటిదే. ఎన్నికలప్పుడు గుళ్లు తిరగడం కామన్, కానీ ఇలా 'శాఖల' వారీగా దేవుళ్లను పంచుకోవడం మాత్రం విచిత్రం. కేసీఆర్ గారు వైష్ణవంతో 'మోక్షం' పొందాలనుకుంటే, రేవంత్ రెడ్డి గారు శైవంతో 'శక్తి'ని ప్రదర్శిస్తున్నారు. రేపు ఇంకెవరైనా వచ్చి "మేము శాక్తేయులం" అని అమ్మవారిని పట్టుకొస్తారో ఏమో!చివరికి ఏ దేవుడు కరుణిస్తాడో కానీ.. తెలంగాణ ఓటర్లు మాత్రం ఈ "ఆధ్యాత్మిక వార్" చూసి తెగ ఎంజాయ్ చేస్తున్నారు!

## ప్రారంభమైన సలేశ్వర జాతర

- మొదటి పేజీ తరువాయి



చెంచుపెంట మీదుగా 20 కిలోమీటర్లు వాహనంలో ప్రయాణించాలి. హైదరాబాద్ నుంచి వెళ్లేవారు శ్రీశైలం హైవేపై అమ్రాబాద్ మండలం మన్ననూరు నుంచి 15 కిలోమీటర్లు ప్రయాణించాలి. పర్హాబాద్ జంక్షన్ దగ్గర అటవీశాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకుని అడవిలోకి అడుగుపెట్టాలి. మీరు తీసుకెళ్లే వాహనం ఆధారంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సలేశ్వరానికి 4 కిలోమీటర్ల ముందు వాహనాలు నిలిపేస్తారు.అక్కడి నుంచి కొండలు, గుట్టలు, రాళ్లు దాటుకుంటూ దాదాపు 4 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళితే ఆలయానికి చేరుకోవచ్చు.కాలినడకన వెళ్లేవారు నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం అంబగిరి, లింగాల మండలం, అప్పాయిపల్లి మీదుగా 30 కిలో మీటర్లు ప్రయాణించిన తర్వాత తాగునీటి వసతి ఉంటుంది. అక్కడ కాసేపు సేదతీరి మళ్లీ నడక ప్రారంభిస్తే అక్కడి నుంచి మరో 20కిలోమీటర్ల దూరంలో ఉంటుంది సలేశ్వరం. చిన్నారులు, వృద్ధులు ఈ యాత్ర చేయడం కష్టమే.సలేశ్వరం క్షేత్రానికి ఎదురుగా ఉన్న ఎత్తైన కొండలపై నుంచి జాలువారే జలపాతాలు భక్తులను కనువిందు చేస్తాయి. భక్తులు మాత్రమే కాదు పర్యాటకులు కూడా సలేశ్వరం యాత్ర చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. నడిచి వెళ్లే మార్గంలో నెమళ్లు, జింకలు, అటవీ జంతువులు కనిపిస్తాయి. ఇదో సాహసయాత్ర.సలేశ్వరం జాతరకు వెళ్లే భక్తులు అటవీ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్లాస్టిక్ బాటిల్స్, చిప్స్ ప్యాకెట్లు, పాలిథిన్ కవర్లు తీసుకురావొద్దని..తీసుకొస్తే మార్గ మధ్యలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పాయింట్లలో మాత్రమే పడేయాలని చెబుతున్నారు. అన్నదానం చేయాలి అనుకునే భక్తులు ఆకులు ఉపయోగించుకోవచ్చని సూచిస్తున్నారు.లింగాల మండలం దట్టమైన నల్లమల అడవిలో ఉన్న కొండ గుహల్లోనే పాండవులు కొన్నాళ్లు అజ్ఞాతవాసం చేశారని చెబుతారు. అరణ్యవాసం పూర్తిచేసుకుని విరాట రాజు కొలువుకి వెళ్లేలోగా మధ్యలో కొన్ని రోజు ఈ కొండగుహల్లోనే ఉన్నారని స్థలపురాణం. అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులు ఇబ్బందిపడకుండా ఉండేందుకు ఈ క్షేత్రానికి కొన్ని కిలోమీటర్ల దూరంల ఉన్న కృష్ణానది నీటిని శివుడు రప్పించాడని పురాణగాథ. శివపార్వతులు ఇక్కడ తపస్సు చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. సలేశ్వరాన్ని మొదట శైలపురం అని పిలిచేవారు..కాలక్రమేణా అది సలేశ్వరంగా మారింది. ఇక్కడ ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు నుంచి 3 రోజులు జాతర నిర్వహిస్తారు. ఈ సమయంలో ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించి గుహలో కొలువైన లింగమయ్యని దర్శించుకుంటారు. ఏడాదికి మూడు రోజులు మాత్రమే తెరిచి ఉండే ఈ ఆలయంలో చెంచు పూజారులు పూజలు చేస్తారు.సలేశ్వరం క్షేత్రంలో శివయ్య రెండు సహజసిద్ధమైన గుహల్లో దర్శనమిస్తాడు. పైనున్న గుహలో ప్రధాన దైవం లింగమయ్య.. మరో గుహలో మరో శివలింగం ఉంటుంది. ఆలయం ఎదుట గంగమ్మ, వీరభద్రుడి విగ్రహాలుంటాయి.. ఇక్కడ భారీగా కానుకలు సమర్పించాల్సిన అవసరం లేదు మంచి ఆలోచనతో కళ్లు మూసుకుని శివయ్యను ధ్యానిస్తే చాలంటారు చెంచుపూజారులు

## రోజుకు 15 కోట్ల పౌల్ట్రీ వ్యాపారం నష్టం..

- మొదటి పేజీ తరువాయి

పనివారి జీతాలు, మున్సిపల్ పన్నులు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 15 నుండి రూ. 20 మార్జిన్ ఇస్తేనే తాము బతకగలమని, లేదంటే నష్టాల్లో కూరుకుపోతామని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని గ్రేటర్ చికెన్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. బాయిలర్ చికెన్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నాయని, తక్కువ మార్జిన్‌తో చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చికెన్ ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొనేది తామేనని, కానీ అసలైన లాభం మాత్రం పెద్ద కంపెనీలకే వెళ్తోందని రిటైలర్లు వాదిస్తున్నారు. ఈ మార్జిన్ పెంచే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని వారు భీష్మించుకుని కూర్చున్నారు. సమ్మె కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 10 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు వ్యాపారం దెబ్బతింటుందని అంచనా. కేవలం మాంసం విక్రయాలే కాకుండా, చికెన్‌పై ఆధారపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా పడింది. హోటల్ యజమానులు అధిక ధర చెల్లించి బయటి జిల్లాల నుండి చికెన్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ సమ్మె ఎంతకాలం కొనసాగుతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కంపెనీ ప్రతినిధులు , రిటైలర్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ, మార్జిన్ పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించాలని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కోరుతున్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే, ఈ సమ్మె మరింత కాలం కొనసాగే అవకాశం ఉంది.

## గౌలిపూరలో వీర హనుమాన్ బైక్ ర్యాలీ

**హైదరాబాద్:** హనుమాన్ జన్మదినం పురస్కరించుకొని ఆలయాల వద్ద విద్యుత్ దీపాలతో పాటు తీరొక్క రంగుల పూలతో సుందరంగా అలంకరణ చేశారు. తెల్లవారు జామున నుంచి భక్తులు ఆంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మరియు గౌలిపుర డివిజన్ లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి విశ్వహిందూ పరిషత్ , మరియు బజరంగ్ దళ్ , ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఛత్రినాక ఏసిపి, సి.హెచ్, చంద్రశేఖర్. ఛత్రినాక సీఐ కోటేశ్వరరావు విచ్చేసి ప్రత్యేక పూజ నిర్వహించిన అనంతరం ఛత్రినాక ఏసిపి, సి.హెచ్, చంద్రశేఖర్. జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీలో నలుమూలల నుండి వేలాది మంది భక్తులు, యువకులు కాషాయం జండాలతో జైశ్రీరామ్, జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ ముందుకు సాగింది. హనుమాన్ జన్మదినం పురస్కరించుకొని పాతబస్తీలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చార్మినార్ జోన్ డిసిపి ఖరే కిరణ్ ప్రభాకర్ సున్నితమైన ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆలయాల వద్ద సీసీ కెమెరాలు పర్యవేక్షణలో కదలికలను పరిశీలిస్తూ భారీ బందోబస్తు నిర్వహించారు.

వార్తాతరంగాలు
శుక్రవారం 03 ఏప్రిల్ 2026

## మోడీతో లోకేష్ భేటీ



**విజయవాడ, ఏప్రిల్ 2:**ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఎన్డీయే ఎంపీలతో కలిసి ఆయన ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా ప్రధానికి శాలువా కప్పి, ఏపీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ భేటీ అనంతరం లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. "అమరావతి కోసం తమ భూములను త్యాగం చేసి, ఏళ్ల తరబడి నిలబడిన రైతుల అసాధారణ గాథను ప్రధానికి వివరించాను. వారి త్యాగాలను గౌరవిస్తూ, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ఆయన మార్గనిర్దేశం కోరాను" అని పేర్కొన్నారు. అనంతరం లోకేశ్, ఇతర ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిసి బిల్లు ఆమోదానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026 బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది.. ఎగువ సభలోనూ ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందింది ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకే లోకేశ్ ఢిల్లీ పర్యటనకు వచ్చారు. 2014 నాటి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5ను సవరిస్తూ.. 'కొత్త రాజధాని' అనే పదం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అని ఈ బిల్లు స్పష్టం చేస్తోంది. తన పర్యటనలో భాగంగా లోకేశ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను కూడా కలిశారు

## డిగ్రీ కాలేజీల అడ్డగోలు దందా



**హైదరాబాద్, ఏప్రిల్ 2:**హైదరాబాద్‌లో కొత్త డిగ్రీ కాలేజీల ఏర్పాటు అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కనీస నిబంధనలు పాటించకుండా, ఏ ఒక్క యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు లేకుండానే నగరంలో 11 బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ఏదైనా కొత్త కాలేజీని ఏర్పాటు చేయాలంటే గుర్తింపు పొందిన వర్సిటీ అనుబంధ గుర్తింపు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ ముందస్తు అనుమతులు, కనీసం వర్సిటీల అనుబంధ గుర్తింపు(అఫిలియేషన్) లేకుండానే కొన్ని విద్యాసంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించడం ఏంటనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త డిగ్రీ కాలేజీలకు సంబంధించి ఒక ప్రముఖ కాలేజీ పేరుతో హైదరాబాద్‌లోని మణికొండ, కూకట్ పల్లి, సనత్ నగర్, సంతోష్ నగర్, మియాపూర్, నారాయణగూడ, సికింద్రాబాద్, దిల్‌సుఖ్ నగర్, బోయిన్ పల్లి, హబ్సిగూడ, లింగంపల్లిలలో బ్రాంచీలను ఏర్పాటుచేయబోతున్నట్టు తెలిసింది. కాగా, ఈ కాలేజీలు కొత్తగా ఏర్పాటు అవుతున్నవి కావని, కన్వర్షన్ కింద అడ్మిషన్లు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కన్వర్షన్ చేసుకున్నా ప్రభుత్వం నుండి కన్వర్షన్ అనుమతి తీసుకున్నట్లు అధికారిక ప్రకటన లేకుండా ఎలా అడ్మిషన్ల ప్రక్రియ, ప్రచార కార్యక్రమాలు చేపడతారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఈ కాలేజీలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ప్రజాప్రతినిధికి చెందినవిగా తెలుస్తోంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేటు డిగ్రీల కాలేజీలను తీసుకుని తమ కాలేజీ పేరుతో నడిపించుకునేందుకు రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే హోర్డింగులు, ప్రకటనలతో భారీ ఎత్తున అడ్మిషన్ల ప్రచారం చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఒక కాలేజీకి యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు తప్పనిసరి అవసరం. కానీ అఫిలియేషన్ ప్రక్రియను పక్కనపెట్టి ముందస్తుగానే అడ్మిషన్లు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు అడ్మిషన్లు సైతం తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా, ఈ కాలేజీ దోస్త్ పరిధిలో లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నట్లు అధికారిక వర్గాల సమాచారం. నిబంధనలను పక్కన పెట్టి, ధనార్జనే ధ్యేయంగా, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో కాకుండా ఇష్టారీతిన ఫీజులు పెంచుకుంటూ అడ్మిషన్లు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా రాష్ట్రంలో ఏదైనా కొత్త డిగ్రీ కాలేజీ ప్రారంభించాలంటే ఉన్నత విద్యా మండలి అనుమతితో పాటు, స్థానిక యూనివర్సిటీ ఉస్మానియా లేదా జేఎన్టీయూ వంటి వాటి నుంచి అఫిలియేషన్ తప్పనిసరి. కానీ, ఈ కొత్త కాలేజీలకు ఇప్పటివరకు ఏ ఒక్క యూనివర్సిటీ నుంచి కూడా గుర్తింపు లేదని తెలుస్తోంది. అఫిలియేషన్ లేకుండానే కాలేజీలు లాంచ్ చేయబోతున్నారన్న సమాచారంతో ఇప్పటికే ఆయా కాలేజీలపై సీఎంవోకు, ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. యూనివర్సిటీ అఫలియేషన్లు లేకుండానే కాలేజీలో అడ్మిషన్లను జోరుగా నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై సీఎంఓ, ఉన్నతవిద్యామండలిలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా అడ్మిషన్లు చేపడితే విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, కాలేజీ యాజమాన్యాల తీరులో మార్పు రావడం లేదని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దు...

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట:**హరీష్ రావు మాట్లాడుతూ అసెంబ్లీ లో పోరాడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసాం మక్కల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోగలరు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. సిద్దిపేట మార్కెట్ లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు రైతు లు దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ రైతుల పక్షాన అసెంబ్లీ లో కొట్లాడితే వేంటనే ప్రభుత్వం దిగొచ్చి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేశారని సిద్దిపేట మార్కెట్ యార్డ్ కుడా లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని చెప్పారు... రైతు లు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటె తక్కువ ధరకు ప్రైవేట్ కు అమ్ముకోని రైతులు నష్ట పోవద్దని రైతు లు నష్ట పోవద్దు అని అసెంబ్లీ లో మీ గురించి కొట్లాడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అయ్యేల చూసామన్నారు. కావున రైతు లు కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఏదులాబాద్ గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యం

**ఘట్ కేసర్:**మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏదులాబాద్లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్న 7వ తరగతి విద్యార్థి అవినాష్ (12) అదృశ్యమయ్యాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉట్టపల్లి గ్రామానికి చెందిన అవినాష్ బుధవారం స్కూల్లో జరిగిన క్రీడా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కనిపించకుండా పోయినట్లు స్కూల్ సిబ్బంది గుర్తించారు. స్కూల్ సిబ్బంది ఘట్కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# కాంట్రవర్సీకి కేరాఫ్ గా అనిరుధ్ రెడ్డి



**మహబూబ్ నగర్, ఏప్రిల్ 2:**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేరు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ లోపల, బయట ఆయన చేసే వ్యాఖ్యలు వరుస వివాదాలు సృష్టిస్తున్నాయి. ఒక వివాదం సద్దుమనగక ముందే మరో వివాదాస్పద వ్యాఖ్య చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. సినిమా స్టైల్ డైలాగులు, విప్ప సారా కావాలంటూ ప్రతిపాదనలు, అక్రమ కట్టడాలపై విమర్శలు అధిష్టానానికి తలనొప్పిగా మారుతున్నాయా లేక పార్టీకి అస్త్రాలవుతున్నాయా అన్న చర్చ మొదలైంది. సినిమా స్టార్స్‌కి డ్రగ్స్ టెస్ట్ చేయాలన్న అంశంపై అనిరుద్ రెడ్డి తాజా వ్యాఖ్య మరోసారి షేక్ చేస్తోంది. సినీ నటులకు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుంది. హీరోల ప్యాంటు జేబులు లెక్కపెట్టే ఫ్యాన్స్ ఉన్న దేశం ఇది. వాళ్లేం చేస్తే తామూ అది చేయాలనుకుంటారు. అందుకే వాళ్ళు అందరికీ ఆదర్శంగా నిలిచేలా డ్రగ్స్ తీసుకోలేదని సర్టిఫికేట్ తెస్తేనే సినిమా రిలీజ్ చేయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టించాయి. ఇది సినీ నటులను కించపరచడమే.. వారిపై అనుమానాలు కలిగించడమే అంటు సినీ ప్రముఖులు స్పందిస్తున్నారు. కేవలం హీరోలే ఎందుకు, రాజకీయ నాయకులకూ ఇలాంటి పరీక్ష పెట్టే ఎన్నికల పోటీకి అనుమతించాలని మంచు విష్ణు కౌంటర్ ఇచ్చినా, అనిరుధ్ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఇప్ప సారా తెలంగాణ టెకిలా అంటూ అసెంబ్లీలో ఆయన చెప్పిన మాటలు సభ్యులనే ఆశ్చర్యపరిచాయి. ఇప్ప సారా తాగితే 100 ఏళ్లు బతుకుతారు, ప్రభుత్వమే ఇప్ప సారా తయారీ చేయాలి అంటూ ప్రభుత్వానికి సలహా కూడా ఇచ్చారు. ఇది గిరిజన సంస్కృతికి మద్దతా లేక మద్యం పాలసీపై సెటైరా అర్థం కాక విపక్షాలు బిత్తరపోయాయి. కొందరైతే ప్రభుత్వం మళ్లీ మద్యం తయారీ రంగంలోకి దిగాలనుకుంటోంది అందుకే అనిరుద్ రెడ్డి నోటి ద్వారా ఇలాంటి కామెంట్స్ చేయించి ప్రజల స్పందన చెక్ చేస్తోందన్న విమర్శా చేస్తున్నారు. కోనసీమ జిల్లాల కొబ్బరిచెట్లపై తెలంగాణ ప్రజల దిష్టి తగిలి మాడిపోతున్నాయన్న పవన్ కల్యాణ్‌పై అనిరుద్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఒకసారి కాదు పదే పదే పవన్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ.."ఇక్కడ ఉండటం ఇష్టం లేకపోతే విజయవాడ వెళ్ళిపో" అని చేసిన విమర్శలు సోషల్ మీడియాలో యుద్ధానికి దారితీశాయి. పవన్ ఫ్యాన్స్ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యే తీరుపై నొచ్చుకున్నారు. ఓ ఆరు నెలల క్రితం కూడా హైదరాబాద్‌లో బిల్డింగ్ పర్మిషన్లు, మున్సిపల్ అధికారుల అవినీతిపై సొంత ప్రభుత్వంపైనే పరోక్షంగా ఒత్తిడి పెంచుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు పాలనలో పారదర్శకత కోసమా? లేక అసంతృప్తినా? అన్న అనుమానం కలిగిస్తున్నాయి. హైదరాబాద్‌లో నిబంధనల పర్యవేక్షణ లేదు అవినీతి పెరిగిపోతోందని ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వాన్నీ పరోక్షంగా ఇరుకున పెట్టాయి. ఏకంగా సీఎం కార్యాలయంపై వేలెత్తి చూపే అకాశమిచ్చాయి కూడా. ఇలా వరుస కాంట్రవర్షియల్ కామెంట్స్ చేసే అనిరుధ్ రెడ్డిని ప్రభుత్వం ఒక 'టూల్'లా వాడుకుంటోందా? అనే చర్చా సాగుతోంది. ఏదైనా కీలక నిర్ణయం తీసుకునే ముందు ప్రజల స్పందన ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి అనిరుధ్ లాంటి 'బోల్డ్'నాయకులతో ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తుండవచ్చు. దీనికి కైట్ ఫ్లయింగ్ అనే పరిభాషకూడా వుంది. రాజకీయ వాతావరణం అనుకూలంగా ఉందా లేక ప్రతికూలంగా ఉందా తెలుసుకునేందుకు ఇలాంటి నోటి దురుసు నాయకులను ప్రభుత్వం వాడుకుంటుంది. డ్రగ్స్ కంట్రోల్ లేదా మద్యం పాలసీలో మార్పుల వంటి వివాదాస్పద వ్యాఖ్యలు అందుకు నిదర్శనం అంటున్నారు. రేవంత్ రెడ్డికి అండగా ఉంటూనే, ప్రత్యర్థులపై ఎదురుదాడికి అనిరుధ్ రెడ్డి లాంటి నాయకులు మంచి టూల్ అవుతారు. ఒక్కోసారి అనిరుధ్ మాటలు పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నాయి. కానీ, అప్పుడప్పుడు ఆయన చేసే అతి వ్యాఖ్యలు మిత్రపక్షాలనో లేదా తటస్థ వర్గాలనో ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. అయితే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి టీంలో అనిరుధ్ ఒక కీలకమైన స్ట్రాటజిక్ ప్లేయర్ అన్నది కాదనలేని నిజం. చివరిగా.. అనిరుధ్ రెడ్డి మాటలు గాలిలో పేలే బుడగలా? లేక లక్ష్యాన్ని ఛేదించే తూటాలా? అన్నది ముందు ముందు తేలనుంది. కానీ ప్రస్తుతానికి మాత్రం ఆయన తెలంగాణ రాజకీయాల్లో నోటికి పని చెప్పే ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకున్నారు.

# రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

**ఏకంగా 40 వేల కోట్లు**

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**తెలంగాణలో గత ఏడాది భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఏకంగా రూ.40 వేల కోట్లకుపైగా మద్యాన్ని మందుబాబులు తాగేశారు. దీంతో తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదాయంలో సరికొత్త రికార్డును అందుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి రూ.40 వేల కోట్ల మార్కు దాటింది. ఇందులో బీర్ల అమ్మకాలు తగ్గగా.. లిక్కర్ సేల్స్ మాత్రం పెరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు.. వైన్స్‌లు, బార్ల టెండర్ల ద్వారా కూడా భారీగానే ఖజానాకు ఆదాయం సమకూరింది. డిసెంబర్ నెలలో అత్యధికంగా రూ.5,051 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణలో మద్యం ఆదాయం ఏటికేడాది సరికొత్త రికార్డులను అధిగమిస్తోంది. ఈ నేపథ్యంలోనే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. మద్యం అమ్మకాలతోపాటు.. బార్లు, వైన్స్‌ల టెండర్లు, మద్యం దుకాణాల ఫీజుల రూపంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఆదాయం గణనీయంగా పెరిగినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో తెలంగాణ ఏర్పాటు తర్వాత ఒక్క ఏడాదిలోనే ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.44 వేల కోట్ల మార్కు దాటడం గమనార్హం. ఈ ఆర్థిక ఏడాదిలో రాష్ట్రంలో ఏకంగా రూ.40,209 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 2,620 ఏ-4 మద్యం దుకాణాలకు అప్లికేషన్ల రూపంలోనే ఆబ్కారీ శాఖకు రూ.2,869 కోట్లు వచ్చాయి. ఇక మద్యం దుకాణాల రెంటల్ ఫీజుల ద్వారా మరో రూ.1,771 కోట్లు.. 1,214 బార్ల ద్వారా ఇంకో రూ.549 కోట్ల ఆదాయం వచ్చి చేరింది. దీంతో 2025-26 ఆర్థిక ఏడాదిలో ఎక్సైజ్ శాఖ ఖజానాకు మొత్తంగా రూ.44,557 కోట్లు ఆదాయం సమకూరింది. మరోవైపు.. గతేడాది కంటే ఈసారి మద్యం విక్రయాలు రూ.2,700 కోట్లకు పైగా అధికంగా జరిగాయి. మొత్తంగా గతేడాదిలో 7 శాతం లిక్కర్ సేల్స్ పెరిగినట్లు లెక్కల ద్వారా తెలుస్తోంది. ఇందులో మొత్తంగా 382.91 లక్షల కేస్‌ల లిక్కర్.. 387.34 లక్షల కేస్‌ల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇక అత్యధికంగా డిసెంబరు నెలలో రూ.5,051 కోట్ల మేర లిక్కర్ సేల్స్ జరగ్గా.. అత్యల్పంగా అక్టోబరు నెలలో రూ.2,709 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయి. ఇక అంతకుముందు ఆర్థిక సంవత్సరం 2024-25తో పోల్చితే రాష్ట్రంలో బీర్ల అమ్మకాల్లో 9 శాతం తగ్గుదల నమోదైంది. అదే సమయంలో లిక్కర్ అమ్మకాలు మాత్రం భారీగా పెరిగాయి. 2018-19లో రాష్ట్రంలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.20,859 కోట్ల ఆదాయం రాగా.. అది 2025-26 ఆర్థిక ఏడాది నాటికి రూ.44 వేల కోట్లు దాటడం గమనార్హం. 2024-25 ఏడాదిలో మొత్తంగా రూ.37,487 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. అది ఈ ఏడాది మరింత పెరిగింది. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2015-16 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.12,706 కోట్ల మద్యం అమ్మకాలు మాత్రమే జరగ్గా.. 2025-26 వచ్చే సరికి రూ.40 వేల కోట్లు దాటాయి. అంటే మద్యంపై వచ్చే ఆదాయం సుమారు 3 రెట్లు పెరిగింది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికలు.. డిసెంబర్ 31 కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో 2025 డిసెంబరు నెలలో మద్యం ఏరులై పారి.. అత్యధిక ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.



## హైదరాబాద్‌లో చికెన్ దొరకట్లే

**- కోళ్లకూ ఓ రోజొచ్చింది...!**



**హైదరాబాద్, ఏప్రిల్ 2:**హైదరాబాద్ మహానగరంలో చికెన్ ప్రియులకు పెద్ద షాక్ తగిలింది. నగరంవ్యాప్తంగా వందలాది చికెన్ షాపులు స్వచ్ఛందంగా మూతపడటంతో మాంసం విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనూ కిటకిటలాడే చికెన్ సెంటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణం రిటైల్ వ్యాపారులకు, హోల్‌సేల్ సరఫరాదారులకు మధ్య తలెత్తిన మార్జిన్ వివాదం . తమకు వస్తున్న లాభం నామమాత్రంగా ఉందని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మార్జిన్ పెంచకపోతే వ్యాపారం చేయలేమని రిటైలర్లు సమ్మెకు దిగారు. ఈ వివాదానికి ప్రధాన కేంద్రం చికెన్ విక్రయాలపై వచ్చే కమిషన్. ప్రస్తుతం బాయిలర్ కంపెనీలు రిటైల్ షాపుల యజమానులకు కిలోకు కేవలం రూ. 5 నుండి రూ. 7 వరకు మాత్రమే మార్జిన్ ఇస్తున్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, పనివారి జీతాలు, మున్సిపల్ పన్నులు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 15 నుండి రూ. 20 మార్జిన్ ఇస్తేనే తాము బతకగలమని, లేదంటే నష్టాల్లో కూరుకుపోతామని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని గ్రేటర్ చికెన్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. బాయిలర్ చికెన్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నాయని, తక్కువ మార్జిన్‌తో చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చికెన్ ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొనేది తామేనని, కానీ అసలైన లాభం మాత్రం పెద్ద కంపెనీలకే వెళ్తోందని రిటైలర్లు వాదిస్తున్నారు. ఈ మార్జిన్ పెంచే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని వారు భీష్మించుకుని కూర్చున్నారు. సమ్మె కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 10 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు వ్యాపారం దెబ్బతింటుందని అంచనా. కేవలం మాంసం విక్రయాలే కాకుండా, చికెన్‌పై ఆధారపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా పడింది. హోటల్ యజమానులు అధిక ధర చెల్లించి బయటి జిల్లాల నుండి చికెన్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమ్మె ఎంతకాలం కొనసాగుతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కంపెనీ ప్రతినిధులు , రిటైలర్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ, మార్జిన్ పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించాలని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కోరుతున్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే, ఈ సమ్మె మరింత కాలం కొనసాగే అవకాశం ఉంది.

## కేబీఆర్ పై ఓవర్ పనులు వేగవంతం చేయాలి

**స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్**

**హైదరాబాద్:**స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ, పురపాలక శాఖ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ గురువారం ఉదయం బంజారాహిల్స్ లోని కేబీఆర్ పార్క్ కొనసాగుతున్న ఫ్లై ఓవర్ పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందని అయన అన్నారు. పనులు వేగంతం చేయడంతోపాటు ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని అయన అన్నారు. మేఘా ఇంజనీరింగ్ సంస్థ కుడా అదనపు సిబ్బంది, మరిన్నీ యాంత్రిక పరికరాలను వినియోగించాలని అయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఛీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తదితరులు పాల్గోన్నారు

### మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి ఊరట!

**కార్తీక్ రెడ్డి వేసిన పిటిషన్ కొట్టేసిన ఎన్జీటీ!**

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో భారీ ఊరట లభించింది. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ముప్పు ఉందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన ఎన్జీటీ పిటిషన్ కొట్టేసింది. పిటిషన్‌పై విచారణ ముందుకు తీసుకెళ్లేందుకు సరైన ఆధారాలు లేవని ఎన్జీటీ అభిప్రాయపడింది. ఇప్పుడు ప్రాజెక్టు పనులు శరవేగంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వానికి అవకాశం లభించింది.

### ఆర్ధరాత్రి పోలీసుల చెబుత్రమిషన్

**హైదరాబాద్:**టప్పాచెబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో నిన్న రాత్రి పోలీసులు చెబుత్ర మిషన్ నిర్వహించారు. అర్ధరాత్రి వరకు బస్తీలలో గుంపులుగా కూర్చొని సమయం గడుపుతున్న సుమారు 13 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇందులో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని విచారించగా వారి వద్ద నుంచి 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. షేక్ అమీర్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని మరింత విచారణ కొనసాగిస్తున్నారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై గుంపులుగా కూర్చొని ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని స్టేషన్ ఎస్హెచ్ఓ బాలకృష్ణ హెచ్చరించారు.

### కర్మాన్ ఘట్ ఆలయంలో ఘనం హనుమాన్ జయంతి

**హైదరాబాద్:**కర్మాన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో అభిషేకాలు, అలంకరణలు, ఆర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్ వ్యవస్థ, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# గ్యారంటీలపై సందేహాలుంటే
# తెలంగాణకు రండి

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:**సీఎం మాట్లాడుతూ అవినీతి.. కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్..విజయన్ కుటుంబాలు. కేంద్ర నిధులు మోదీ కరుణ కాదు ప్రజల హక్కు యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.కొచ్చి యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి..తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు.

**మోదీ బ్రదర్స్..పినరాయి కేసీఆర్‌ల మధ్య పోలికలు**

ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరాయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరాయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరాయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరాయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. పో మోనే విజయా,వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు.అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన.. తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని.. అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల



కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు.

**తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు..**

కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని..దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగాతీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ -2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.

**కేరళం లో ఇందిరా ఐదు గ్యారంటీలు:**

కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలోని ఇందిరా ఐదు గ్యారంటీలు:కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కేఎస్ఆర్టీసీ, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.కాలేజీ చదువుతున్న బాలికలకు నెలకు రూ.1,000 ఆర్థిక సహాయం.సంక్షేమ పింఛన్లు నెలకు రూ.3 వేలకు పెంపు.మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా.యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు.ఐదు గ్యారంటీలతో పాటు సముద్ర, విమానయాన రంగాలకు సంబంధించి ఐదు డ్రీమ్ ప్రాజెక్టులు, వయనాడ్‌లో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు వాగ్దానాలు ఉన్నాయి.

# అమరావతి మనకు ఒక సెంటిమెంట్

## ఎన్డీఏ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్

**అమరావతి:**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం నాడు ఎన్డీఏ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలీకాన్ఫరెన్స్లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఈ రోజు ఒక చారిత్రాత్మక దినంగా నిలుస్తోంది. రాజ్యసభలో మన రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందబోతోంది. కేంద్ర సహకారంతో పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందుతోంది. అమరావతికి అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన అతి తక్కువ సమయంలోనే బిల్లును ప్రవేశపెట్టింది. అమరావతి మనకు ఒక సెంటిమెంట్. 5 ఏళ్ల పాటు రాజధాని లేకుండా చేశారు. ఇప్పుడు మావిగన్ అని మాట్లాడుతున్నారు... అమరావతి పట్ల వారికున్న ద్వేషానికి ఇది పరాకాష్ట.అమరావతి పేరు పలకడానికే జగన్ ఇష్టపడరు. అందుకే మావిగన్ అని వింత పేరును తీసుకొచ్చారని అన్నారు.గతంలోనూ 'ఎస్ఆర్ఎం అమరావతి' అని పేరు ఉంటే... ఎస్ఆర్ఎంగా మార్పించారు. అమరావతి పేరు వింటేనే జగన్కు కంపరంగా ఉండి నిత్యం విషం కక్కుతున్నాడు. అమరావతి పట్ల జగన్ వైఖరి భవిష్యత్లోనూ మారదని నిన్నటితో మరోసారి స్పష్టమైంది. మా రాజధాని అమరావతి అని ప్రతీ ఒక్కరిలో భావన రావాలి.



బిల్లు ఆమోదించి చేయూత ఇచ్చిన కేంద్రానికి ధన్యవాదాలు. రాజ్యసభలో ఆమోదం పొందిన తర్వాత పార్లమెంట్లో ఆమోద ప్రక్రియ పూర్తయినట్లే. బిల్లు పాస్ అయినందుకు ఈ రోజు సాయంత్రం అన్ని గ్రామాల్లో పండుగలా కార్యక్రమాలు జరపాలి. ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన రీతిలో రాజధాని సంబరాలు జరపుకునే సమయమిది. ఇవాళ అమరావతి బిల్లు ఆమోదం పొందినందుకు ప్రతి ఒక్కరూ కేంద్రానికి ధన్యవాదాలు తెలపాలి. నేను మధ్యాహ్నం రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెనికి వెళ్తున్నాను... రాజధాని సంబరాల్లో పాల్గొంటున్నాను. దేశంలోని వివిధ పుణ్యస్థలాల నుంచి తెచ్చిన నీళ్లు, మట్టి ఉంచిన పవిత్ర ప్రాంతం ఉద్దండరాయునిపాలెం. మనం అనుకున్న అభివృద్ధి సవ్యంగా సాగాలని ప్రతి కోరుకోవాలి... సంకల్పం తీసుకోవాలి. మన రాజధానికి స్థిరత్వం వచ్చేలా సహకరించిన ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, మద్దతు తెలిపిన వారికి కృతజ్ఞతలు. గత ఐదేళ్లు మీకు 3 రాజధానులా అని ఎగతాళిగా మాట్లాడారు. ఏకైక రాజధాని నా రాజధాని అమరావతి అని గౌరవంగా చెప్పుకునే రోజు వచ్చింది. కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు కూడా సాధ్యమైనంత త్వరలో ఏర్పాటు చేస్తాం. అన్ని రాష్ట్రాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు.

ఈ టెలీకాన్ఫరెన్స్లో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవ్ చద్దాకు ఆప్ షాక్...

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**అరవింద్ కేజ్రీవాల్ తీసుకున్న ఓ నిర్ణయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలు ముఖ్యంగా సామాన్యుల ఇబ్బందులపై తన గళాన్ని వినిపించే యువ ఎంపీ రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ నేత పదవి నుంచి ఆప్ తొలగించింది. ఆయన స్థానంలో ఎల్పీయూ ఛాన్సలర్ అశోక్ మిట్టల్‌ను నియమించింది. అయితే, ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను మాత్రం ఆ పార్టీ ఎటువంటి ప్రకటన చేయలేదు.రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి యువ ఎంపీ రాఘవ్ చద్దాను అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ తొలగించారు. ఆయన స్థానంలో పంజాబ్ ఎంపీ, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ఛాన్సలర్ అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటేరియట్‌కు ఆప్ సమాచారం ఇచ్చింది. ఏడుగురు పంజాబ్, ముగ్గురు ఢిల్లీ సహా రాజ్యసభలో ఆప్‌కు మొత్తం 10 మంది సభ్యులు ఉండగా.. సంజయ్ సింగ్ ఆ పార్టీ నాయకుడిగా ఉన్నారు. రాజ్యసభలో బీజేపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తర్వాత సంఖ్యా పరంగా ఆప్ నాలుగో స్థానంలో ఉంది. అయితే, ఒకప్పుడు ఆప్ అగ్రశ్రేణి నేతగా, పార్టీలో అధినేత అరవింద్ కేజ్రీవాల్ అంతరంగికుల్లో ఒకరిగా పరిగణించిన రాఘవ్ చద్దాను డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్ అయిన 33 ఏళ్ల చద్దా ఆప్ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నారు. అవినీతి వ్యతిరేక ఉద్యమం సమయంలో కేజ్రీవాల్‌తో చద్దాకు పరిచయం ఏర్పడింది. తర్వాత కేజ్రీవాల్ ప్రారంభించిన ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరారు. ఢిల్లీ లోక్‌పాల్ బిల్లు ముసాయిదా రూపకల్పనలో పాల్గొన్నారు.ఆప్ జాతీయ అధికార ప్రతినిధిగా ఆ పార్టీ తరఫున తరుచూ టీవీ చర్చలలో కనిపిస్తూ కీలక నేతగా గుర్తింపు పొందారు. 26 ఏళ్ల వయసులో ఆప్ జాతీయ ట్రెజరర్‌గా నియమితులయ్యారు. ఇక, 2020 ఢిల్లీ ఎన్నికల్లో రాజేంద్ర నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఢిల్లీ జల్ బోర్డ్ వైస్-ఛైర్మన్‌గానూ పనిచేశారు. 2022లో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభకు నామినేట్ చేసిందిఇదిలా ఉండగా, రాఘవ్ చద్దాను డిప్యూటీ లీడర్ పదవి నుంచి తప్పించడానికి గల కారణాలను ఆప్ అధికారికంగా వెల్లడించనప్పటికీ, పార్టీలో



ఆయన స్థానం గురించి గత కొన్ని నెలలుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కీలకమైన పార్టీ కార్యక్రమాలకు గైర్హాజరు కావడం, కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలకు మద్యం పాలసీ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం వంటి పరిణామాలపై చద్దా స్పందించకపోవడం అనేక ఊహాగానాలకు దారితీసింది. కానీ, ఎయిర్‌పోర్టుల్లో ఆహార పదార్థాల అధిక ధరలు, గిగ్ వర్కర్ల హక్కులు, ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ రద్దీ వంటి కీలక సమస్యలను రాజ్యసభలో ఆయన లేవనెత్తారు.

# ప్రేమించి..వేధించి...

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**ఐదేళ్ల పాటు ప్రేమించుకుని, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న జంట కథ విషాదాంతంగా ముగిసింది. వివాహమైన 50 రోజులకే యువతి బలవన్మరణానికి పాల్పడింది. అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ దారుణ ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. . బీహార్‌కు చెందిన ఇషిక యాదవ్ (26), మధ్యప్రదేశ్‌కు చెందిన నీరజ్ బన్సాల్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఫేస్‌బుక్ ద్వారా వీరి పరిచయం మొదలైంది. ఇద్దరూ హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించి ఈ ఏడాది ఫిబ్రవరి 10న పాట్నాలో వివాహం చేసుకున్నారు. అనంతరం మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కాపురం పెట్టారు.పెళ్లయిన కొన్ని రోజుల నుంచే నీరజ్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. అదనపు కట్నం కింద బంగారం, వజ్రాభరణాలు, నగదు తీసుకురావాలంటూ ఇషికను మానసికంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయింది. బంధువులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించినా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ కుమార్తె మృతికి ఆమె భర్త నీరజ్ వేధింపులే కారణమని ఇషిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# అమరావతికి రాజ్యసభ ఆమోదముద్ర

## మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన (సవరణ) బిల్లు-2026కు రాజ్యసభలో ఘనమైన ఆమోదం లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై గురువారం ఎగువసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లును ఆమోదించగా, నేడు రాజ్యసభ కూడా పచ్చజెండా ఊపడంతో అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించే దిశగా మరో కీలక అడుగు పడింది. పదకొండు రాజకీయ పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ చర్చలో పాల్గొని ఏపీ రాజధానిగా అమరావతికి తమ మద్దతు ప్రకటించారు.ఈ చర్చలో అనూహ్య రీతిలో ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు పలికాయి. కాంగ్రెస్, బీజేపీ, టీడీపి, జనసేన వంటి పార్టీలతో పాటు తెలంగాణ నుంచి భారత్ రాష్ట్ర సమితి కూడా ఈ బిల్లును సమర్థించింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితికి ఈ బిల్లు ముగింపు పలుకుతుందని ఎంపీలు పేర్కొన్నారు. అయితే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రం బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రస్తావిస్తూ, రాజధాని ప్రాంత రైతులకు ఇచ్చే పరిహారంపై స్పష్టత లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేసింది.చర్చను ప్రారంభిస్తూ కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి, ఏపీ రాజధాని విషయంపై ఇంతకాలం ఆలస్యం జరగడం పార్లమెంటు వైఫల్యమని, ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రసంగిస్తూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అని ఉద్వేగభరితంగా చెప్పారు. 2014 విభజన గాయాలను ఈ చట్టం మాన్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీలు తమ ప్రసంగాల్లో అమరావతిని బెంగళూరు, హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరారు.తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు భంగం కలగకుండా, పొరుగు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం తమకు ఇష్టమని బీఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేశారు. ఏపీకి ఒక శాశ్వత రాజధాని ఉండటం వల్ల తెలుగు రాష్ట్రాల మధ్య మరింత సహకారం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు అన్ని ప్రధాన పార్టీలు అమరావతికే ఓటు వేయడంతో సభలో ఒక అరుదైన ఏకాభిప్రాయం కనిపించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ చర్చకు సమాధానం ఇస్తూ, ఏపీ ప్రజల ఆకాంక్షలకు గౌరవం ఇస్తూనే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. కేవలం వాయిస్ ఓట్ ద్వారా బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు చైర్మన్ ప్రకటించడంతో ఏపీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంటులోని ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించినందున ఇది తదుపరి దశలో రాష్ట్రపతి ఆమోదం కోసం వెళ్తుంది. రాష్ట్రపతి సంతకం చేసిన వెంటనే ఇది చట్టంగా మారుతుంది. తదనంతరం కేంద్ర ప్రభుత్వం గెజెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. దీనివల్ల ఏపీ రాజధానిగా అమరావతికి రాజ్యాంగబద్ధమైన హోదా లభిస్తుంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ చట్టాన్ని మార్చడం దాదాపు అసాధ్యమవుతుంది.

**రాజధాని బిల్లును వ్యతిరేకిస్తూ రాజ్యసభలోనూ వైసీపీ వాకౌట్**

రాజ్యసభలో అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యసభలో అమరావతి బిల్లుపై మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి, ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక పెద్ద డ్రామాగా అభివర్ణించారు. ప్రస్తుత రూపంలో ఉన్న అమరావతి బిల్లును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. అసలు రాజధాని నిర్ణయం అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గతంలో కేంద్రమే అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తు చేస్తూ, మరి ఇప్పుడు కేంద్రం ఈ బిల్లును ఏ ప్రాతిపదికన ప్రవేశపెట్టిందని ఆయన ప్రశ్నించారు. కేంద్రానికి బిల్లు పెట్టే అధికారం లేదన్నారు. అమరావతి నిర్మాణం వల్ల రాష్ట్రంపై పడే ఆర్థిక భారాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఒక్కో ఎకరా అభివృద్ధికి రూ. 2 కోట్లు ఖర్చవుతుందని చెబుతున్నారని, మొత్తం ప్రాజెక్టుకు అవసరమైన రూ. 2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వడ్డీల రూపంలోనే రూ. 20 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిలో ప్రతి చదరపు అడుగుకు రూ. 12 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారని, దీని వెనుక పెద్ద ఎత్తున కుంభకోణాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసమే తమ ప్రభుత్వం గతంలో మూడు రాజధానుల నిర్ణయం తీసుకుందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అమరావతిని శాసన రాజధానిగా ఉంచుతూనే, విశాఖపట్నాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా, కర్నూలును జ్యుడీషియల్ క్యాపిటల్‌గా చేయాలన్నదే తమ విధానమని చెప్పారు. అమరావతి ప్రాంతం వరదలతో మునిగిపోతుందని ఇప్పటికే ఆధారాలు ఉన్నాయని, అటువంటి ప్రాంతంలో వేల కోట్లు కుమ్మరించడం సరైన నిర్ణయం కాదని వాదించారు. అసెంబ్లీలో సరైన చర్చ జరపకుండానే తీర్మానం చేశారని సుబ్బారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం కేవలం ఒక ప్రాంతానికే పరిమితమై మిగిలిన ప్రాంతాలను విస్మరిస్తోందని విమర్శించారు. తన ప్రసంగం అనంతరం, బిల్లుకు నిరసనగా వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

# చిరంజీవి ఇంట్లో
# హనుమంతుడిపై సూర్యకిరణాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2:**దేశవ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ పర్వదినం సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి తన అచంచల భక్తిని చాటుకుంటూ ఓ ప్రత్యేక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తన ఇంటి పూజా మందిరంలో ఏటా జరిగే ఓ అద్భుత దృశ్యాన్ని ఆయన అభిమానులకు చూపించారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.ప్రతి సంవత్సరం కొన్ని నెలల పాటు సూర్యకిరణాలు ఇంద్రధనస్సులోని సప్తవర్ణాల్లా మారి, తమ పూజగదిలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని పైనుంచి కింద వరకు తాకుతాయని చిరంజీవి వివరించారు. ఈ అద్భుత దృశ్యం మాటల్లో చెప్పలేని ఆధ్యాత్మిక అనుభూతిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని వివరిస్తూ, ఇటీవల అయోధ్యలో బాలరాముడి విగ్రహంపై పడిన 'సూర్య తిలకం'ను ఆయన గుర్తుచేసుకున్నారు. కోణార్క్, అరసవిల్లి వంటి ప్రఖ్యాత పుణ్యక్షేత్రాల్లోనూ ఇలాంటి దైవిక కిరణాలు దర్శనమిస్తాయని, అలాంటి అద్భుతమైన అనుభూతిని తన ఇంట్లోనే పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని చిరంజీవి అన్నారు.చిరంజీవికి చిన్నప్పటి నుంచి ఆంజనేయస్వామిపై ఉన్న భక్తి, విశ్వాసం గురించి అందరికీ తెలిసిందే. తన ప్రతి విజయానికీ ఆ స్వామి ఆశీస్సులే కారణమని ఆయన బలంగా విశ్వసిస్తారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సమాజాభివృద్ధి...







**సర్దార్ పాపన్న గౌడ్ స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు**

**త్వరితగతిన సమస్యల పరిష్కారం**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 2 (స్కై న్యూస్)** మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే కుటుంబంతోపాటు గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతూ సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం సాగించి పదివేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని వీటిని కుటుంబ అవసరాలకు వెచ్చించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు నిరంతరం మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉంటే రాజకీయ లబ్ధి కోసం గత ప్రభుత్వం సామాజిక మాధ్యమాలలో విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళలు విద్యార్థినిలు సంక్షేమ పథకం ద్వారా ఉచితంగా బస్సు ప్రయాణం సాగిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నారని గతంలో ఇతరులపై ఆధారపడి బస్సు ప్రయాణాలు చేస్తూ ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వ చొరవతో ప్రవేశపెట్టిన పథకం ద్వారా అటు మహిళకే కాకుండా ఇటు ఆర్టిసి సంస్థకు కూడా లాభం చేకూరుతుందని ప్రయాణించే ప్రతి మహిళ చార్జీని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 8.98 కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రతి మాసం వేల రూపాయల ఆదాయాన్ని మహిళలు ఉచిత ప్రయాణం ద్వారా పొందుతున్నారని వివరించారు ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా పొందుతున్న లబ్ధిని వివరించారు కార్యక్రమంలో డిపో మేనేజర్ యాదయ్య డిటిఓ బాలు నాయక్ మునిసిపల్ చైర్మన్ తీగల సునీంద్ర ఆర్టిఏ మెంబర్ గోపాల్ రెడ్డి ప్రసంగించగా మునిసిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సన్మానించగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విముక్తి కోసం సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ వీరోచిత పోరాటం నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్య సాహసాలను నిర్వహించిన సామాజిక పోరాటాల స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునీంద్ర కుమార్ మాజీ ఎమ్మెల్యే మోహన్ గౌడ్ తాలూకా అధ్యక్షుడు వంగా లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పకీరయ్య గౌడ్ జిల్లా అధ్యక్షుడు మల్లయ్య గౌడ్ నాయకులు వెంకటయ్య గౌడ్ నారాయణ గౌడ్ శ్రీధర్ గౌడ్ బాలా గౌడ్ నాగరాజు గౌడ్ తో పాటు పలువురు పాల్గొన్నారు అనంతరం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన 6 మరియు 12 మరియు 23వ వార్డు ప్రజా పాలన పట్టణ ప్రగతి సభకు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కాలనీలలో సిసి రహదారులతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గత రెండు సంవత్సరాలుగా పరిష్కరిస్తున్నట్లు వివరించారు మౌలిక వసతుల కల్పన రోడ్లు డ్రైనేజీ త్రాగునీరు మరియు వీధి దీపాల వంటి సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు వెంటనే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునీంద్ర కౌన్సిలర్లు శ్రీనివాసులు ఆవంచ మాధవి రాజు చంద్రకళ శ్రీనివాసులు తో పాటు ప్రజలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షునిగా ఎ. లక్ష్మీనారాయణ ఎన్నిక




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 2:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో కోర్టు పర్యవేక్షణలో ఎన్నికల జరిగిన కౌంటింగ్‌లో అమరవాది లక్ష్మీనారాయణ 6 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించారు ఈ సందర్భంగా ఎ. లక్ష్మీనారాయణ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం కోశాధికారి, సామాజిక కార్యకర్త షాద్ నగర్ కు చెందిన నీల రవీందర్ హర్షం వ్యక్తం చేశారు అదేవిధంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా నీల రవీందర్ మాట్లాడుతూ న్యాయస్థానం పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ ఎన్నికల్లో లక్ష్మీనారాయణ గెలవడం సంతోషదాయకమన్నారు ఆయన నాయకత్వంలో ఆర్యవైశ్య మహాసభ మరింత బలోపేతం చేయాలన్నారు సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి వారు కృషి చేయాలని ఆకాంక్షించారు వారి పదవీ కాలం విజయవంతంగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్టు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహా సభ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార దిశగా గ్రామసభలు ఉండాలి...

**కౌన్సిలర్ తిమ్మాజీపేట పాండు**



**నాగర్ కర్నూల్ మార్చి 2( స్కైన్యూస్)** ఆర్భాటాల కోసం కాకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలని ఆ దిశలోనే అధికారులు కృషి చేయాలని మునిసిపల్ కౌన్సిలర్ తిమ్మాజీపేట పాండు అన్నారు గురువారం ఈదమ్మ గుడి సమీపంలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి రెండవ వార్డ్ కౌన్సిలర్ తిమ్మాజీపేట పాండు 12వ వార్డు ముమ్మడి జయలక్ష్మి 13వ వార్డు కౌన్సిలర్ కొత్త గంగాధర్ లు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గ్రామ సభల పేరుతో రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు నిధులను మంజూరు చేసి ఆయా కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని అదేవిధంగా గ్రామ సభలలో వచ్చే ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆయా కాలనీలో ప్రజలు పాల్గొన్నారు

## నేతన్నకు భరోసా చెక్కులు పంపిణీ చేసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**నేతన్నకు అండగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం**



**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 2 (స్కై న్యూస్):**గద్వాలలో చేనేత కార్మికులకు భరోసా కల్పించే కల్పతరువు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.చేనేత కార్మికులకు వెన్నంటే ఉండి వారికి ఆదుకోవడంలో ముందు ఉంటానని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.జోగులాంబ గద్వాల జిల్లాలోని చేనేత కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేతన్న భరోసా పేరిట మంజూరు చేసిన చెక్కులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గురువారం 16వ వార్డులో పంపిణీ చేశారు. ఆయన కార్మికులతో మాట్లాడుతూ నేతన్నకు అండగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని , చేనేత కార్మికులకు కొరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గద్వాల జిల్లాలో ఉండే ప్రతి చేనేత కుటుంబానికి వచ్చే విధంగా సహకరిస్తానని అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో చేనేత మగ్గం నేసే కార్మికులు 2714 , నేత నేసే వారికి సహాయకులు అంచు పట్టే వారు 2642 మంది చేనేత కార్మికులకు వారికి చేనేత భరోసా కింద సంవత్సరానికి సరిపడు నిధులను రూ.6,47,4,000 మంజూరు కాగా, ప్రతి మూడు మాసాలకు ఒకసారి చేనేత కార్మికులకు ఖాతాలో జమ అవుతాయని, మొదటి మూడు మాసాలకు గాను రూ.1,61,76,000 లలో మగ్గం నేసే చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున, మగ్గం నేసే చేనేత కార్మికుల సహాయకులు అంచు పట్టే వారికి ఒక్కొక్కరికి రూ 1500 చొప్పున ప్రతి మూడు నెలలకోసారి వారి అకౌంట్లో జమ కానున్నట్లు చేనేత కార్మికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జిల్లా అధికారులు డీఓ సుధారాణి, ఏ డీ వో ప్రియాంక, బాలకృష్ణ, రాఘవేంద్ర కాలనీ 9 వ వార్డు కౌన్సిలర్ రామలింగేశ్వర కాంబ్లే, పద్మశాలి రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ, నాయకులు అక్కల శ్రీనివాసులు, అక్కల శాంతారాం, అనిత, సుభద్ర , శాఖ రామాంజనేయులు, తదితర చేనేత కార్మికులు పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

**21 వ వార్డు కౌన్సిలర్ పడిగా శంకర్**



**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 2 (స్కైన్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకే ప్రజా పాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు 21 వ వార్డు కౌన్సిలర్ పడిగ శంకర్ అన్నారు ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ పరిధిలోని వార్డులో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన సభకు ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును వివరించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండి సంక్షేమ పథకాల కోసం అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి వారికి న్యాయం చేయడంతో పాటు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు కాలనీవాసులు పాల్గొన్నారు

## గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



**జోగులాంబ గద్వాల, ఏప్రిల్ 2(స్కై న్యూస్):**గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులే కాక ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గద్వాల మండలం చేనుగోనుపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ కు రూ 500 సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాని అర్హులైన వారికి కూడా ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని తెలియజేశారు. ఇటీవలే రైతు భరోసా పంటల పెట్టుబడి సాయాన్ని ఎకరా లోపు పొలం ఉన్న రైతులకు ఇవ్వడం జరిగిందని, మిగతా రైతులకు కూడా దశలవారీగా రైతు భరోసా డబ్బులు వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉండే బాల్యవివాహాలు, ఇతర సామాజిక సమస్యలపై ప్రతి ఒక్క పౌరులు స్పందించి వాటి నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర గీతంతో గ్రామ సభను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పద్మమ్మ స్వాగత ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. గ్రామంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారుల వివరాలను తెలియజేశారు. అలాగే పలువురు లబ్ధిదారులు సంక్షేమ పథకాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, మండల ప్రత్యేక అధికారి నూకరాజు, డిఎల్ పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, ఇన్చార్జి ఎంపీడీవో చంద్రకళ, హౌసింగ్ డిఇ కాశీనాథ్, ఉప సర్పంచ్ రాముడు, పంచాయతీ కార్యదర్శి రామ నర్సింహులు, వివిధ శాఖల ఇతర అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన వార్డ్ సభలపై అధికారుల నిర్లక్ష్యం...

**ఎండి.సలీం**

**పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**



**నారాయణపేట ఏప్రిల్ 2 (స్కై న్యూస్)** నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 7 మరియు 8 వవార్డ్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం భాగంగా పట్టణం లో వార్డ్ సభలను సంబంధిత అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు నారాయణపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి. సలీం గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ రోజు ఉదయం నిర్వహించాల్సిన వార్డ్ సభల గురించి ప్రజలకు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిర్వహించడం వల్ల ప్రజలు సభలకు దూరమయ్యారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అధికారులే ఉద్దేశపూర్వకంగా భ్రష్టుపట్టించడం అత్యంత ఖండనీయమని ఆయన పేర్కొన్నారు.నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని అనేక వార్డ్‌లలో ఇదే పరిస్థితి కొనసాగుతుండటం బాధాకరమని,కొన్ని వార్డ్ లలో నిర్వహించిన వార్డ్ సభలో తాగునీరు లాంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని,సరైన టెంట్లు, కుర్చీలు కూడా వేయలేదన్నారు.నారాయణపేట మున్సిపాలిటీలో బిజెపి,బిఆర్ఎస్ పార్టీ లకు చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉండడం వల్ల అలాంటి వారికి మున్సిపల్ కమిషనర్ వార్డ్ సభలకు వార్డ్ ఇంచార్జి అధికారులుగా నియమించడం తో వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా పని చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.కాబట్టి,ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని,అవసరమైతే సస్పెండ్లేదా ఉద్యోగాల నుండి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## చుక్క లక్ష్మీనారాయణకు ఏ ఎస్ఐ గా పదోన్నతి....



**గద్వాల, ఏప్రిల్ 2(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీసులో గురువారము ఎస్పీ శ్రీనివాసులు చేతుల మీదుగా స్టార్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్మీనారాయణకు పదోన్నతి తోపాటు బాధ్యతలు కూడా పెరిగాయని, గతంలో ఉమ్మడి మహబూబ్ నగర్ కానిస్టేబుల్ గా ఉద్యోగం పొందిన తర్వాత అంచలంచలుగా ఎదిగి హెడ్ కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐగా పదోన్నతి పొందడం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో లక్ష్మీనారాయణకు ఒక్కనికి మాత్రమే పదోన్నతి వచ్చిందని, జిల్లాలో అతనికి మంచి పేరు ఉందని,ఏ పనిచేసిన నియమ నిబద్ధతగా పనిచేసేవాడని ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ ఉద్దేశించి మాట్లాడారు. ఏ ఎస్ ఐ ప్రమోషన్ పొందడం వలన బాధ్యత కూడా పెరుగుతాయని, బాధ్యతగా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి శంకర్, ఆర్.ఐ. లు వెంకటేష్, నరేష్ లు పాల్గొన్నారు.

## నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఏప్రిల్ 2 :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ లోని 26 వార్డులో భీమమ్మ నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసారు ఈ సందర్భంగా లబ్ధిదారులకు బట్టలు పెట్టి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు, ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బచ్చలి నరేష్, కొప్పునూరి ప్రవీణ్, మురళీ మోహన్ అప్పి, రాజు నాయక్ జ్రుమద్ ఖాన్, ప్రదీప్ భరత్ లోహటి, నాగమణి, బొట్టు రాజు, మంజుల, నాగేష్, లక్ష్మి, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు

# షాద్ నగర్ పట్టణంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వ ఆత్మ బలిదాన్ దివస్ వర్ధంతి వేడుకలు

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చి 2 :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వ ఆత్మ బలిదాన్ దివస్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోల్కొండ ఖిల్లాపై విజయ పతాకాన్ని ఎగురేయడమే లక్ష్యంగా తుదివరకు పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు జన హృదయంలో అతనొక సర్దార్ చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీరు సాహెబ్ వీరంతా ఆయన ప్రధాన అనుచరులు పన్నెండు మందితో మొదలైన ఆ పోరాటం, పన్నెండు వేల మంది సైన్యంగా అవతరించింది అదంతా పాపన్న నాయకత్వంలో రూపొందిన సైన్యమే అమ్మా తాటిచెట్టు ఎక్కను లొట్టి పట్టను గోల్కొండ పాలనా పగ్గాలు పట్టడమే నా జీవిత ఆశయం అని తన తల్లి సర్వమ్మకు పాపన్న మాటిచ్చినట్లు చారిత్రక అధ్యయనకారుల రచనల ద్వారా వెల్లడవుతుంది గోల్కొండ కోటను ఏడు గడియలు పాలించాడు కుతుబ్‌షాహీ రాజ్యాన్ని ఓడించిన ఔరంగజేబు 1687లో గోల్కొండ రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు అదే సమయంలో ప్రాంతాల వారీగా జాగిర్దారు, సుబేదారుల పదవుల్లో తన మనుషులను నియమించి, వాళ్లకు పరిపాలనా బాధ్యతలు అప్పగించాడు మొగల్ చక్రవర్తి జాగిర్దార్లు, పాలనాధికారుల దౌర్జన్యాలకు అడ్డూ అదుపూ లేకుండా సాగాయి పేద, సామాన్య ప్రజల నుంచి విపరీతంగా పన్ను వసూలు చేయడం పెచ్చుమీరింది అధికారంలో ఉన్నవాళ్ల ఆగడాలు పెరిగాయి పేదల కష్టాలు, కడగండ్లను చూసి చలించిన సర్వాయి పాపన్న పెత్తందారీలపై ధిక్కార బావుటా ఎగురవేశాడు సైన్యాన్ని కూడగట్టి గెరిల్లా పోరాటం ద్వారా తన స్వస్థలం ఖిలాషాపూర్ రాజధానిగా పాలన సాగించాడు భువనగిరి కోటను వశం చేసుకొని సుమారు రెండు దశాబ్దాల పాటు ఏలాడు లొట్టిపట్టే చేతితో ఆయుధం ధరించి రాచరికంలో సామ్యవాద సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించాడు పాపన్న ఛత్రపతి శివాజీకి సమకాలీకుడు కూడా రాజవంశీకులే రాజ్యాధికారం చేపడతారనే నానుడిని చెరిపేసి, చరిత్రలో మహావీరుడిగా చిరస్మరణీయుడిగా మిగిలాడు మొగలాయిలకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న 1709లో కన్నుమూశారు ఆయన మరణంపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి శత్రువుల చేతిలో కన్నుమూయడాన్ని అవమానంగా భావించిన పాపన్న తన బాకుతో తానే శిరచ్ఛేదనం చేసుకున్నాడని ప్రచారంలో ఉంది దక్కన్ రాజ్యంపై ఢిల్లీ పెత్తనాన్ని ధిక్కరించి గోల్కొండ ఖిల్లాపై స్వతంత్ర్య బావుటా ఎగరేసిన సర్దార్ సర్వాయి పాపన్న పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం సమకాలీన రాజకీయాలకూ ఆయన ధిక్కార బాట ఆదర్శనీయం ఈ కార్యక్రమం లో గౌడ



సంఘం నాయకులు జండ్లగూడెం గోవర్ధన్ గౌడ్, గంద్రతి బాలరాజ్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్, అశన్న గౌడ్, బాలానగర్ నర్సింలు గౌడ్, పీర్లగూడెం రాజు గౌడ్, శంకర్ గౌడ్, అన్నారం బాను చందర్ గౌడ్,జండ్లగూడెం వరుణ్ గౌడ్,పీర్లగూడెం అభిలాష్ గౌడ్, నక్కల విజయ్ గౌడ్,బంటారం మహేష్ గౌడ్,మొగిలిగిద్ద కార్తీక్ గౌడ్,పోలేపల్లి ప్రవీణ్ గౌడ్, రంగంపల్లి సురేష్ గౌడ్,రంగంపల్లి శ్రీధర్ గౌడ్,చౌలపల్లి మణికంఠ గౌడ్,నరేష్ గౌడ్,రంగంపల్లి మల్లేష్ గౌడ్, రాఘవేంద్రర్ గౌడ్, బొమ్మ శివ కుమార్ గౌడ్,సంతోష్ గౌడ్, బంటారం రాఘవేందర్ గౌడ్,జీనికుంట్ల మహేష్ గౌడ్,ఈడిగ శేఖర్ గౌడ్, బాలానగర్ శ్రీకాంత్ గౌడ్, బాలానగర్ రాజు తదితరులు పాల్గొన్నారు ఆపద్బాంధవుడు సమసమాజ స్థాపన సాధనకు ప్రాణాలను పణంగా పెట్టిన వీరుడు రాజరికంలో వికసించిన సామ్యవాద గొంతుక సర్దార్ సర్వాయి పాపన్న నేడు ఆయన 316వ ఆత్మ బలిదాన్ దివస్ వర్ధంతి ఈ సందర్భంగా ఆ మహావీరుడి జ్ఞాపకార్థం గోల్కొండ ఖిల్లాపై విజయ పతాకాన్ని ఎగురేయడమే లక్ష్యంగా తుదివరకు పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్, జన హృదయంలో అతనొక సర్దార్ చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీరు సాహెబ్ వీరంతా ఆయన ప్రధాన అనుచరులు పన్నెండు మందితో మొదలైన ఆ పోరాటం, పన్నెండు వేల మంది సైన్యంగా అవతరించింది అదంతా పాపన్న నాయకత్వంలో రూపొందిన సైన్యమే అమ్మా తాటిచెట్టు ఎక్కనులొట్టి పట్టను గోల్కొండ పాలనా పగ్గాలు పట్టడమే నా జీవిత ఆశయం అని తన తల్లి సర్వమ్మకు పాపన్న మాటిచ్చినట్లు చారిత్రక అధ్యయనకారుల రచనల ద్వారా వెల్లడవుతుంది గోల్కొండ కోటను ఏడు గడియలు పాలించాడు కుతుబ్‌షాహీ రాజ్యాన్ని ఓడించిన ఔరంగజేబు 1687లో గోల్కొండ రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు అదే సమయంలో ప్రాంతాల వారీగా జాగిర్దారు, సుబేదారుల పదవుల్లో తన మనుషులను నియమించి, వాళ్లకు పరిపాలనా బాధ్యతలు అప్పగించాడు మొగల్ చక్రవర్తి జాగిర్దార్లు, పాలనాధికారుల దౌర్జన్యాలకు అడ్డూ అదుపూ లేకుండా



సాగాయి పేద, సామాన్య ప్రజల నుంచి విపరీతంగా పన్ను వసూలు చేయడం పెచ్చుమీరింది అధికారంలో ఉన్నవాళ్ల ఆగడాలు పెరిగాయి పేదల కష్టాలు, కడగండ్లను చూసి చలించిన సర్వాయి పాపన్న పెత్తందారీలపై ధిక్కార బావుటా ఎగురవేశాడు సైన్యాన్ని కూడగట్టి గెరిల్లా పోరాటం ద్వారా తన స్వస్థలం ఖిలాషాపూర్ రాజధానిగా పాలన సాగించాడు అని అన్నారు భువనగిరి కోటను వశం చేసుకొని సుమారు రెండు దశాబ్దాల పాటు ఏలాడు లొట్టిపట్టే చేతితో ఆయుధం ధరించి రాచరికంలో సామ్యవాద సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించాడు పాపన్న ఛత్రపతి శివాజీకి సమకాలీకుడు కూడా రాజవంశీకులే రాజ్యాధికారం చేపడతారనే నానుడిని చెరిపేసి, చరిత్రలో మహావీరుడిగా చిరస్మరణీయుడిగా మిగిలాడు మొగలాయిలకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న 1709లో కన్నుమూశారు ఆయన మరణంపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి శత్రువుల చేతిలో కన్నుమూయడాన్ని అవమానంగా భావించిన పాపన్న తన బాకుతో తానే శిరచ్ఛేదనం చేసుకున్నాడని ప్రచారంలో ఉంది దక్కన్ రాజ్యంపై ఢిల్లీ పెత్తనాన్ని ధిక్కరించి గోల్కొండ ఖిల్లాపై స్వతంత్ర్య బావుటా ఎగరేసిన సర్దార్ సర్వాయి పాపన్న పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం సమకాలీన రాజకీయాలకూ ఆయన ధిక్కార బాట ఆదర్శనీయం అని అన్నారు ఈ కార్యక్రమం లో గౌడ సంఘం నాయకులు జండ్లగూడెం గోవర్ధన్ గౌడ్, గంద్రతి బాలరాజ్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్, అశన్న గౌడ్, బాలానగర్ నర్సింలు గౌడ్, పీర్లగూడెం రాజు గౌడ్, శంకర్ గౌడ్, అన్నారం బాను చందర్ గౌడ్,జండ్లగూడెం వరుణ్ గౌడ్,పీర్లగూడెం అభిలాష్ గౌడ్, నక్కల విజయ్ గౌడ్, బంటారం మహేష్ గౌడ్, మొగిలిగిద్ద కార్తీక్ గౌడ్, పోలేపల్లి ప్రవీణ్ గౌడ్, రంగంపల్లి సురేష్ గౌడ్, రంగంపల్లి శ్రీధర్ గౌడ్, చౌలపల్లి మణికంఠ గౌడ్, నరేష్ గౌడ్, రంగంపల్లి మల్లేష్ గౌడ్, రాఘవేంద్రర్ గౌడ్, బొమ్మ శివ కుమార్ గౌడ్, సంతోష్ గౌడ్, బంటారం రాఘవేందర్ గౌడ్, జీనికుంట్ల మహేష్ గౌడ్, ఈడిగ శేఖర్ గౌడ్, బాలానగర్ శ్రీకాంత్ గౌడ్, బాలానగర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జాజాపూర్ లో ఘనంగా జట్టీ హనుమాన్ జయంతి ఉత్స వాలు

**చిన్నారులను తులాభారం చేసి మొక్కులు తీర్చుకున్న భక్తులు**





**నారాయణపేట ఏప్రిల్ 2:( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలో ఆర్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో గురువారం జట్టీ హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఉదయం ఆలయంపై కాషా య ధ్వజారోహణం చేశారు. అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకం,విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలునిర్వహించారు. లోకకల్యాణం కోసం హోమం జరిపారు. కాగా స్వామి వారి అనుగ్రహంతో సంతానం కలిగిన భార్యా భర్తలు తమకు కలిగిన సంతానం చిన్నారులకు స్వామి వారి ఆలయం ముందు బంగారం(బెల్లం)తో నాణేలతో,లడ్డు తో తులాభారం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో జరిపే హోమంలో కూర్చుని సంతానం కలగాలని మొక్కుకున్న భార్య భర్తలు వచ్చే ఉత్సవాల నాటికి స్వామివారి అనుగ్రహంతో సంతానం కలుగుతుందన్న విశ్వాసం స్వామివారి భక్తులకు ఉంది. ఈ సారి అలా సంతానం కలిగిన 63 మంది చిన్నారులకు స్వామి వారి ముందు తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలకు స్థానిక భక్తులతో పాటు కర్ణాటక,మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాదం అందజేశారు.

## తాటి చెట్లు ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**గౌడ సంఘం నాయకులు కట్టా వెంకటేష్ గౌడ్**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 2:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులపల్లి రోడ్ లో ఇష్టం వచ్చినట్లు తాటిచెట్లను నరికివేసి ధ్వంసం చేసిన వ్యక్తులపై ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు కట్టా వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు గౌడ కులస్తులకు ఆర్థిక వనరులైన తాటిచెట్లను అక్రమంగా నరికివేసి గౌడ సామజికవర్గ జీవనోపాధిని దెబ్బతీయడం హేయమైనా చర్యని ఆయన మండిపడ్డారు ఏడేళ్ల క్రితం ఎవరికి తెలియకుండా అనుమతి పత్రాన్ని పొంది అప్పటినుండి నేటి వరకు ఇష్టం వచ్చినట్లు చెట్లు నరుకుతూ తీవ్ర నష్టం కలిగించారన్నారు ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని లేనిపక్షంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

## మహేశ్వరం మండలంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 2 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, తుమ్మలూరు గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలను నిర్వహించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి హాజరయ్యారు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలను సి.ఎస్. రామకృష్ణ రావు, కలెక్టర్ సి నారాయణ రెడ్డి. రాష్ట్ర గీతం జయజయహే గీతంతో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అభివృద్ధి అంటారు మీరు, అవస్థల్లో ఉంటాము మేము

**సమస్యలు ఉన్నాయి పట్టించుకోండి సార్**
**అధికార ప్రభుత్వ హామీలు ఏమైనట్లు?**
**మా కష్టాలు మీకు కనిపించడం లేదా?**
**26వ వార్డులో ప్రజల ఆగ్రహం**
**ప్రత్యేక అధికారి రాజబాబుకు వినతి పత్రం**





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చి 2 :** మీరు అభివృద్ధి గురించి రోజు చెప్తుంటారు కానీ మేము అవస్థలు పడుతుంటాం మా సమస్యల పట్ల మీకు పట్టింపు లేదు అధికార పార్టీ ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదు వాటిపై దృష్టి సారించండి మా సమస్యలు తెలుసుకుని పరిష్కరించండి అంటూ 26వ వార్డు ప్రజలు పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు పట్టణంలోని 26వ వార్డులో కౌన్సిలర్ ఎస్పీ శివ నేతృత్వంలో వార్డు సభ నిర్వహించారు ఈ సందర్భంగా సమస్యలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు ఈ నేపథ్యంలో వార్డు ప్రజలు ఒక్కొక్కటిగా సమస్యలు వెలుగులోకి తెచ్చారు ప్రభుత్వం చేపట్టిన కళ్యాణ లక్ష్మిలో భాగంగా తులం బంగారం ఇస్తామన్నారు ఎక్కడ అంటూ ప్రశ్నించ్చారు అదేవిధంగా కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెన్షన్లు, వృద్ధాప్య పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లలో కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు చాలామంది ఎదురుచూస్తున్నారని, త్వరగా చేపట్టాలని కోరారు అదేవిధంగా 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ అందరికీ అందడం లేదని, మరి ఎవరికి ఇస్తున్నారో ప్రభుత్వమే చెప్పాలని ప్రశ్నించారు గత ప్రభుత్వం ద్వారా వచ్చిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు లబ్ధిదారులకు ఇల్లు అందకుండా తప్పించేసారని, అర్హులకు న్యాయం చేయాలని కోరారు మున్సిపల్ శాఖకు సంబంధించి శానిటేషన్ వర్కర్ల కొరత కారణంగా పారిశుద్ధ కార్యక్రమం సజావుగా జరగడంలేదని తెలిపారు వార్డులో విజిటిపాలకు సంబంధించి సమస్య ఉందని దీనిని కూడా పట్టించుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలలో భాగంగా ప్రతి మహిళకు 2500 రూపాయల గౌరవ పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని దృష్టికి తెచ్చారు ఇకనైనా ప్రభుత్వం స్పందించి వీటన్నింటిని సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని కోరుతూ వార్డ్ ప్రత్యేక అధికారి రాజబాబుకు వినతి పత్రం అందజేశారు వార్డు ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

# షాద్‌నగర్‌లో పట్టణంలో వార్డు సభలు..

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలపై చర్చలు**





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) మార్చ్ 2 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల అమలులో భాగంగా 23, 24, 25 వార్డులలో సభలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరయ్యారు యోగ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చలకు వేదికగా నిలిచింది ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ అగ్గనూర్ విశాల, 25వ వార్డు ప్రతినిధి పెంటయ్య, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు వార్డ్ ఇన్‌చార్జ్‌లు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపించడమే ఈ వార్డు సభల ప్రధాన లక్ష్యమని చైర్మన్ బసవేశ్వర్ పేర్కొన్నారు 99 రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు సమర్థవంతంగా అమలు అవుతున్నాయా అనే అంశంపై కూడా సమీక్ష నిర్వహించారు పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమన్నారు ప్రతి వార్డులో పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమం ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు మరో అడుగుగా నిలిచిందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి

**షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్**

**గ్రామ సభలకు హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కమిషనర్ సునీత రెడ్డి, ప్రత్యేక అధికారి ఏఈ రమేష్**






**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 2 :** రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పట్టణాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దబోతుందని, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ అన్నారు 99 రోజుల ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ 12, 13, 14 వార్డుల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు నాజియా బేగం, కళ్యాణ్ కార్ దిలీప్ తదితరుల వార్డులకు సంబంధించి గ్రామసభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి మూడు వార్డుల ప్రజలు హాజరయ్యారు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కమిషనర్ సునీత రెడ్డి, ప్రత్యేక అధికారి ఏఈ రమేష్ లు హాజరైన ఈ సభలో వైస్ చైర్మన్ అందేమోహన్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల లబ్ధిదారుల వారు పొందుతున్న లబ్ధి గురించి వివరించారు. జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతోపాటు పాలు లేదా రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో గొప్పగా ఉండబోతున్నాయని రానున్న రోజులు బ్రహ్మాండంగా ఉంటాయని అన్నారు ఈ సందర్భంగా ఈ సభలో ప్రజలు పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## కార్పొరేటర్ పడాల ఆకాంక్ష ఆధ్వర్యంలో గ్రామసభ

**ప్రజల సమస్యలు వింటూ వినతుల స్వీకరణ**



**కొత్తగూడెం ఏప్రిల్ 2 ( స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్) కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం శాసనసభ్యులు కునంనేని సాంబశివరావు ఆదేశాల మేరకు గురువారం 11వ డివిజన్ పాత కొత్తగూడెం లో స్థానిక కార్పొరేటర్ ఆకాంక్ష పడాల ఆధ్వర్యంలో వార్డ్ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభను తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభించి గత రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచిన సందేశాన్ని వివరించి, స్థానిక ప్రజలచే అభిప్రాయాలు,వార్డ్ సమస్యలను చర్చించి పలు అంశాలను తీర్మానించి మినిట్స్ బుక్ లో రాసుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రవి కుమార్ , వార్డ్ ఆఫీసర్ ఎన్ రవి , ఆర్ పి అనురాధ , డివిజన్ పెద్దలు పడాల భవాని ప్రసాద్, మహిళలు యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశంలోనే రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తున్న చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

**చిన్న చింతకుంట ఏప్రిల్ 2 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో గురువారం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు కాక ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ మాట్లాడుతూ దేశంలోనే రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తున్న చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించాం అన్నారు. ప్రతి పేద కుటుంబానికి భద్రత ఇవ్వాలని లక్ష్యంతో జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ బీమా జీవిత పథకాన్ని ప్రారంభిస్తున్నాం అన్నారు. రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు భరోసానిస్తూ, ప్రతి కుటుంబానికి రూ 5 లక్షల జీవిత బీమా కలిపిస్తూ విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టాం అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టుకుంటూ ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం అన్నారు. ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఆర్థిక స్వాలంబన కల్పిస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి, ఇప్పటివరకు మహిళలకు 10,000 వేల కోట్ల రూపాయలు ఆదా చేసాం అన్నారు. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంచాం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నం అన్నారు. 21 వేల కోట్లతో రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేశాం, రుణమాఫీతో పాటు వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నం అన్నారు. పేద విద్యార్థులు పస్తులు ఉండొద్దన్న లక్ష్యంతో, విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా జూన్ రెండవ తేదీ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నాం అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించాం అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంద్యాల గ్రామంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదు, ఉంద్యాల గ్రామంలో మొదటి విడత 33 ఇండ్లు ఇచ్చాము, ఈ ఏప్రిల్ లో రెండో విడత ఇండ్లు ఇస్తాం అని హామీ ఇచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. ఉంద్యాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉన్న దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 33 లక్షల మంజూరు చేయించి నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాం, అన్ని సబ్జెక్టులకు టీచర్లను అలట్ చేయించాం, వచ్చే విద్యా సంవత్సరం లో నూతన పాఠశాల భవనాన్ని ఘనంగా ప్రారంభించుకుందాం అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రామ సభలకు శ్రీకారం చుట్టింది, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, గ్రామ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం అన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా మేనిఫెస్టోలో ఇవ్వని ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండండి, ఆశీర్వదించండి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట్ల ఆంజనేయులు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం

**పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం**

**ఆర్థిక స్వాలంబన దిశగా మహిళల అడుగులు**

**శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**

**ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి**

**రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టిక్కెట్లు**

**ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ. 10,000 కోట్ల ఆదా**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**





**కొత్తగూడెం ఏప్రిల్ 2( స్కై న్యూస్):** మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్, ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్య లక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుని జీవితం సమస్త మానవాళికి ఆదర్శప్రాయం

**ఏసిపి లక్ష్మీనారాయణ**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐ సీతారాం**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 2 :** హనుమంతుని జీవితం సమస్త మానవాళికి ముఖ్యంగా నేటి యువతకు అత్యంత ఆదర్శప్రాయం అని షాద్ నగర్ ఏసిపి అన్నారు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐ సీతారాం హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతుడు భక్తి, శక్తి, యుక్తి, నిశ్చలమైన సేవాభావానికి నిలువెత్తు రూపం అని, రామాయణంలో ఆయన పాత్ర, నిస్వార్థంతో కూడిన కార్యాచరణ, సవాళ్లను అధిగమించే విధానం ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు హనుమంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం ఆకు పూజ మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన ఎల్కుర్తి నారాయణ వరలక్ష్మి దంపతులు వారి కుమారులు రామకృష్ణ, శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు ఈ సందర్భంగా అన్నదానం చేసిన ఎల్కుర్తి నారాయణ వరలక్ష్మి కుటుంబ సభ్యులను పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవ వేడుకలు...






**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 2 (స్కై న్యూస్ ):** 365 రోజులు 365 కార్యక్రమాలలో భాగంగా క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ సూచన మేరకు గురువారం 92వ రోజు అచ్చంపేట నాగర్ కర్నూల్ కొల్లాపూర్ ప్రాంతాలలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పుస్తక పఠనంపై అవగాహన కలిగిస్తూ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా జెడ్పిహెచ్ఎస్ నంది వడ్డేమాన్ పాఠశాలలో బహుమతి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు వై పరమేశ్వరయ్య మాట్లాడుతూ రాబోయే వేసవి సెలవుల్లో కనీసం రోజుకు విద్యార్థులు ఒక గంట సమయం కేటాయించి మీకు నచ్చిన పుస్తకాన్ని నచ్చిన భాషల్లో చదివి పఠనా అభ్యాసాన్ని పెంపొందించుకోవాలని కోరాడు. అందుకుగాను అమ్రాబాద్ ప్రాంతంలో 700 పుస్తకాలను పాపిశెట్టి లక్ష్మమ్మ లింగయ్య ల జ్ఞాపకార్థం హకీమ్ లక్ష్మీ కళ మురళి అందజేసినందుకు వారికి మరియు బహుమతుల కోసం 5000 రూపాయలు అందచేసిన హైదరాబాద్ గిరిధర్ మంజుల గార్లకు క్లాస్మేట్ క్లబ్ ధన్యవాదాలు తెలియచేస్తున్నది .గత మూడు మాసాలుగా వివిధ పాఠశాలలకు క్లాస్మేట్ క్లబ్ అందిస్తున్న పుస్తకాలను వేసవి సెలవులలో విద్యార్థులు సద్వినియోగం పరచుకునేటట్లు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సహకరించగలరని మనవి

## అక్షర భవిష్యత్తుకు అండగా నిలిచిన ఉపాధ్యాయుడు బాలకృష్ణ

**దివ్యాంగ విద్యార్థిని దత్తత**




**నారాయణపేట ఏప్రిల్ 2 : (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా జిల్లాలో దామరగిద్ద మండ లం అన్నాసాగర్ గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థిని అక్షర దీనస్థితిని చూసి చలిం చిన ఉపాధ్యాయుడు బాల కృష్ణ ఆమె విద్యా బాధ్య తలను స్వీకరిస్తూ దత్తత తీసుకున్నారు. పత్రికలలో అక్షర ఎదుర్కొంటున్న కష్టాల గురించి చదివిన ఆయన, వెంటనే స్పందించి ఆమెకు అండగా నిలవాలని నిర్ణయిం చుకున్నారు. గురువారం అన్నాసాగర్ గ్రామాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించిన బాలకృష్ణ, అక్షర తల్లిదండ్రులైన వెంకటమ్మ, హనుమంతును కలిసి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా అక్షర కాళ్లకు చెప్పులు తొడిగించి, స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, పెన్నులు అందజేశారు. అక్షర భవిష్యత్తులో ఎంతవరకు చదువుకోవాలని ఆశిస్తే అంతవరకు అయ్యే పూర్తి విద్యా ఖర్చులను తానే భరిస్తానని ప్రకటించారు. బాలకృష్ణ చేసిన ఈ గొప్ప కార్యానికి గుర్తింపుగా గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ఉషనప్ప, ఉపాధ్యా యుడు అలీ ఆయనను శాలువాతో ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో మెన్స్ రైట్స్ అసోసియేషన్ ఫౌండర్ మోహన్ రాజ్, పంచాయతీ కార్యదర్శి బాలరాజ్ గౌడ్, వార్డు సభ్యులు వడ్ల పరబ్రహ్మం, భీములు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొని బాలకృష్ణను అభినందిం చారు. ఒక విద్యార్థిని భవిష్యత్తు కోసం ఉపాధ్యాయుడు తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అన్నాసాగర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

## వార్డులో నెలకొన్న సమస్య లను పరిష్కరించాలని కౌన్సిలర్ నివేదిక



**నారాయణపేట ఏప్రిల్ 2: (స్కై న్యూస్)**నారాయణపేట పట్టణంలోని మూడవ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో కౌన్సిలర్ కాక ర్ల నారాయణమ్మ వార్డులో నెలకొన్న సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకువచ్చా రు. వార్డులో సిసి రోడ్లు అలా గే మురుగు కానలను నిర్మిం చాలని మిషన్ భగీరథ తాగు నీటి పైప్ లైన్ లను వార్డులో ని ప్రజలకు అందించాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు అదేవిధంగా వార్డులో విద్యుత్ సమస్య చాలా తీవ్రంగా ఉందని ఆమె అధికారుల దృష్టికి తీసుకువచ్చారు మూడో వార్డులో గతంలో స్తంభాలు వేశారు కానీ ఆ స్తంభాలకు వైర్లను బిగించడంలో విద్యు త్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె అధికారులకు వివరించా రు. దీంతో పాటు వార్డులో రోడ్లు గుంతల మయంగా మారడంతో తన సొంత ఖర్చులతో మట్టి వేసి రోడ్లను బాగు చేశానని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వార్డులో చాలామంది వితం తులు వికలాంగులు ఉన్నార ని వారికి ప్రభుత్వం నుండి పింఛన్ వచ్చే 57 సంవత్సరా లు పైబడిన వారికి పింఛన్ వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వార్డును నారాయణపేటలో ఆదర్శం గా చూపించాలని తపనతో నేను పని చేస్తున్నానని అధికారులకు విన్నవించారు అధికారులు పరిష్కరించే దిశగా మీరు చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా పాలన అధికారులు తోపాటు వార్డు ప్రజలు మహిళలు పాల్గొన్నా రు.

# హెల్తీగా ఉండాలంటే ఈ పనులు చేయద్దు!



మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం మీద మాత్రమే కాదు, ఆ ఆహారాన్ని దేనిలో నిల్వ చేస్తున్నాం అనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. ప్లాస్టిక్ కంటైనర్లు చూడటానికి సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, కొన్ని రకాల ఆహార పదార్థాలతో అవి జరిపే రసాయన చర్యలు మనల్ని అనారోగ్యానికి గురిచేస్తాయి. కేవలం ఆహారమే కాదు, విలువైన వస్తువులు కూడా ప్లాస్టిక్ వల్ల పాడైపోయే అవకాశం ఉంది. మన వంటిల్లు అంటేనే రకరకాల ప్లాస్టిక్ డబ్బాల నిలయం. రంగురంగుల ప్లాస్టిక్ కంటైనర్లు తక్కువ ధరకే లభించడమే కాకుండా, పగిలిపోవనే నమ్మకంతో మనం వాటిని విరివిగా ఉపయోగిస్తుంటాం. అయితే, మనకు తెలియకుండానే ఈ ప్లాస్టిక్ డబ్బాలు మన ఆరోగ్యానికి, మనం దాచుకునే వస్తువులకు తీరని ముప్పు కలిగిస్తున్నాయి. వండని మాంసం : పచ్చి మాంసాన్ని ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచడం వల్ల బ్యాక్టీరియా త్వరగా వృద్ధి చెంది కాలుష్యానికి దారితీస్తుంది. దీనికి బదులుగా గాలి చొరబడని మూత ఉన్న గాజు పాత్రలను వాడటం సురక్షితం. వేడి ఆహారాలు : వేడివేడి పదార్థాలను ప్లాస్టిక్ లో ఉంచినప్పుడు, అధిక వేడి కారణంగా ప్లాస్టిక్ లోని హానికరమైన రసాయనాలు ఆహారంలోకి విడుదల అవుతాయి. ఆహారాన్ని పూర్తిగా చల్లబరిచిన తర్వాతే నిల్వ చేయాలి. టొమాటో సాస్, కూరలు : టమాటలో ఉండే ఆమ్లతత్వం ప్లాస్టిక్ తో చర్య జరిపి మరకలను, వాసనను కలిగిస్తుంది. దీనివల్ల కెమికల్ లీచింగ్ జరిగే ప్రమాదం ఉంది.పండ్లు, ఆకుకూరలు : బెర్రీలు, సిట్రస్ పండ్లు, ఆకుకూరలను ప్లాస్టిక్ లో ఉంచినప్పుడు తేమ పెరిగి అవి త్వరగా బూజు పడతాయి. వీటికి వెంటిలేషన్ ఉన్న పాత్రలు ఉత్తమం.జిడ్డు పదార్థాలు : నూనె, నెయ్యి వంటి కొవ్వు పదార్థాలు ప్లాస్టిక్ తో స్పందించి ఆహారాన్ని కలుషితం చేస్తాయి.ఆహారేతర వస్తువులపైనా ప్రభావం కేవలం కిచెన్ ఐటమ్స్ మాత్రమే కాదు.. పుస్తకాలు, తోలు వస్తువులు), ఫోటోలను ప్లాస్టిక్ పెట్టెల్లో ఉంచడం వల్ల తేమ చేరి అవి వంగిపోవడం లేదా మసకబారడం జరుగుతుంది. కొవ్వొత్తులను ప్లాస్టిక్ లో ఉంచితే ఎండ వేడికి అవి కరిగి ఆకారాన్ని మార్చుకుంటాయి. గాజు పాత్రలు : ఇవి రసాయన రహితమైనవి, వేడిని తట్టుకోగలవు మరియు శుభ్రం చేయడం సులభం.

# పొద్దునే వేడి నీళ్లు తాగితే అద్భుతాలు జరుగుతాయా?



ఖరీదైన మందులు, సప్లిమెంట్స్ కంటే ప్రకృతి సిద్ధమైన ఇటువంటి చిన్న మార్పులు మన ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతాయి. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది వ్యూస్ సంపాదిస్తున్న ఈ వీడియోలలో ప్రజలు ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం, వేడి అల్పాహారం తీసుకోవడం మరియు చిన్నపాటి వ్యాయామాలు చేయడం కనిపిస్తుంది. దీనిని 'న్యాలీ చైనీస్' అని కూడా పిలుస్తున్నారు. నేటి కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతగా ఉందంటే, వేల ఏళ్ల నాటి సంప్రదాయాలు కూడా సరికొత్త 'ట్రెండ్స్' రూపంలో మన ముందుకు వస్తున్నాయి. 21 ఏళ్ల మరియమ్ ఖాన్ లాంటి ఎంతోమంది యువత ఇప్పుడు ఖరీదైన స్కిన్ కేర్ ప్రోడక్ట్స్ లేదా కఠినమైన వర్కవుట్స్ జోలికి వెళ్లకుండా.. ఒక చిన్న అలవాటును పాటిస్తున్నారు. అదే 'ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం'. చైనా సంప్రదాయ వైద్యం మరియు మన ఆయుర్వేదంలో ఎప్పటి నుంచో ఉన్న ఈ విధానం, ఇప్పుడు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో 'చైనా మ్యాక్సింగ్' పేరుతో వైరల్ అవుతోంది. వేల సంవత్సరాలుగా చైనీస్ మెడిసిన్, మన భారతీయ ఆయుర్వేద వైద్య విధానాల్లో వేడి నీటికి గొప్ప ప్రాధాన్యత ఉంది. ఉదయాన్నే వేడి నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణవ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. వేడి నీరు శరీర ఉష్ణోగ్రతను స్వల్పంగా పెంచుతుంది, దీనివల్ల చెమట పట్టి శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయి. గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి, శరీరమంతటా రక్త ప్రసరణ మెరుగ్గా జరుగుతుంది. ఇది కండరాల నొప్పులను కూడా తగ్గిస్తుంది. ప్రస్తుతం యువత ఈ పాత పద్ధతులకు ఆధునిక మెరుగులు దిద్దుతోంది. కేవలం నీళ్లే కాకుండా, వేడి వేడి అల్పాహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుందని వారు నమ్ముతున్నారు. ఈ వీడియోలు చూసి ఆధునిక యువత తమ జీవనశైలిని మార్చుకుంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది కేవలం మారుతున్న ఫ్యాషన్ కాదు. చల్లటి నీటి కంటే గోరువెచ్చని నీరు శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందని సైన్స్ కూడా అంగీకరిస్తోంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. అయితే, నీరు మరీ ఎక్కువగా మరిగించినది కాకుండా, గొంతుకు హాయిగా ఉండేలా 'గోరువెచ్చగా' ఉండటం ముఖ్యం. మరి మీరు కూడా రేపటి నుండి ఈ 'హాట్ వాటర్ ఛాలెంజ్' మొదలుపెడతారా?

# పుచ్చకాయ, దోసకాయ ఎండాకాలంలో బాడీకి ఏది మంచిది?



ఎండలు మండిపోతున్నాయి. బానుడి భగభగలకు శరీరం త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతోంది. ఈ సమయంలో మనకు తక్షణమే గుర్తొచ్చేవి పుచ్చకాయ, కీర దోసకాయ. ఈ రెండింటిలోనూ నీటి శాతం ఎక్కువే, పోషకాలూ ఎక్కువే. పోషకాల పోరాటం: పుచ్చకాయ, దోసకాయ రెండూ శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంలో దిట్ట. కానీ వాటిలోని పోషక విలువలు వేరుగా ఉంటాయి. దోసకాయలో విటమిన్ కె, సి తో పాటు పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల బలానికి, గుండె ఆరోగ్యానికి, మలబద్ధకం తగ్గించడానికి ఎంతగానో తోడ్పడతాయి. పుచ్చకాయలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి. సోడియం తక్కువగా ఉండటం వల్ల అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది ఒక వరం. నీటి శాతం: హైడ్రేషన్ విషయానికి వస్తే రెండూ అద్భుతమే. అయితే సాంకేతికంగా చూస్తే పుచ్చకాయ కంటే దోసకాయలో నీటి శాతం ఎక్కువ. దోసకాయలో సుమారు 95శాతం నుంచి 96శాతం వరకు నీరు ఉంటే పుచ్చకాయలో 92శాతం ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇవి రెండూ మంచి ఆప్షన్లే. వీరు జాగ్రత్తగా ఉండాలి: అమృతం లాంటి పండ్లే అయినప్పటికీ కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తినే ముందు ఆలోచించాలి. షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నవారు, కిడ్నీ, తీవ్రమైన జీర్ణ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం మంచిది. రాత్రిపూట నిద్ర పట్టని వారు దోసకాయ తినకపోవడమే ఉత్తమం. ఆస్తమా, సైనస్, తరచుగా జలుబు చేసే వారు ఈ రెండింటిని పరిమితంగా తీసుకోవాలి లేదా మానుకోవాలి. బడ్జెట్ ఫ్రెండ్లీ ఏది?: ఆర్థికంగా చూస్తే పుచ్చకాయ కంటే దోసకాయ కొనడం, నిల్వ చేయడం సులభం. దోసకాయలో వ్యర్థ భాగం తక్కువగా ఉంటుంది. దీనిని ఫ్రిజ్ లేకుండా కూడా కొంతకాలం నిల్వ చేయవచ్చు. అదే పుచ్చకాయ అయితే పరిమాణం పెద్దదిగా ఉండటం వల్ల ఖర్చు కూడా ఎక్కువే. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేని వారు ఈ వేసవిలో ఒక రోజు పుచ్చకాయ, ఒక రోజు దోసకాయ మార్చి మార్చి తీసుకోవడం వల్ల గరిష్ట ప్రయోజనాలు పొందవచ్చు. అయితే పండ్లను రసంగా తాగడం కంటే ముక్కలుగా కోసుకుని తినడమే ఆరోగ్యానికి అత్యుత్తమం.



# ఎండాకాలం ఓ గ్లాసు తాగితే కూల్ కూల్..

వేడి వాతావరణంలో అలసట, డీహైడ్రేషన్ సమస్యలతో పాటు జీర్ణ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి బార్లీ నీరు ఒక సులభమైన, ప్రభావవంతమైన సహజ పరిష్కారం.. ఈ పురాతన ఆయుర్వేద పానీయం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలు, అనేక ఇతర ఆరోగ్య సవాళ్లకు బార్లీ నీరు ఒక పురాతన, సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. ఆయుర్వేదంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందించే అనేక ప్రయోజనాలను అందిస్తుంది. వాస్తవానికి బార్లీ నీరు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో (మెగ్నీషియం, మాంగనీస్, సెలీనియం, ఐరన్) నిండిన అద్భుతమైన ఆరోగ్య పానీయం.. ఇది మూత్రపిండాల ఆరోగ్యం, బరువు తగ్గడం, షుగర్ నియంత్రణ.. శరీరాన్ని డీటాక్సిఫై చేయడంలో సహాయపడుతుంది.

బార్లీ నీరు ఆరోగ్య ప్రయోజనాలు:జీర్ణక్రియ మెరుగుపడుతుంది: బార్లీ నీటిలో అధికంగా ఉండే డైటరీ ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌ను ప్రోత్సహిస్తుంది, ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది.. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. మధుమేహులు లేదా రక్తంలో చక్కెర నియంత్రణకు ప్రయత్నిస్తున్న వారికి ఇది చాలా ప్రయోజనకరమైనది. కొలెస్ట్రాల్ నియంత్రణ: బార్లీ నీరు శరీరం నుండి బైల్ యాసిడ్‌ను తొలగించడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. కాలేయం కొత్త బైల్ యాసిడ్‌ను తయారుచేయడానికి ఎక్కువ కొలెస్ట్రాల్‌ను ఉపయోగించేలా చేయడం ద్వారా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మూత్రనాళ ఆరోగ్యం: ఇది సహజమైన మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుంది.. మూత్ర ఉత్పత్తిని పెంచుతుంది. మూత్ర నాళాల నుండి విష పదార్థాలు, బ్యాక్టీరియాను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కాలేయానికి కూడా మేలు చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు బార్లీ నీటిలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవ సమతుల్యత, కండరాల పనితీరుకు చాలా అవసరం. వేడి వాతావరణం, శారీరక శ్రమ లేదా వ్యాయామం వల్ల కోల్పోయే ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయడంలో ఇది సహాయపడుతుంది. ఆయుర్వేదం ప్రకారం, బార్లీ నీరు వాత, పిత్త, కఫ అనే త్రిదోషాలను సమతుల్యం చేయగలదు. బార్లీ నీరు మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడానికి సులభమైన, పోషకాలతో నిండిన పానీయం. ఇది డీహైడ్రేషన్ నుండి జీర్ణక్రియ వరకు, కొలెస్ట్రాల్ నియంత్రణ నుండి ఎలక్ట్రోలైట్ సమతుల్యత వరకు అనేక

# బిజినెస్

## వాట్సప్‌లో డ్యూయల్ అకౌంట్ సదుపాయం




మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది. యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగ దారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్ లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్-అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగిం చడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తవని, వినియో గదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

## హర్మ్యూజ్ జలసంధిలో తగ్గని ఉద్రిక్తతలు..

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు రెట్టింపు

అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా భారత్ తన వ్యూహాన్ని మార్చింది. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సరఫరాకు ఆటంకాలు కలగడంతో భారత్ మళ్లీ రష్యా వైపు మొగ్గు చూపుతోంది. జనవరి నెలతో పోలిస్తే రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఏకంగా రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భారత్ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 40 శాతానికి చేరుకోనుంది. సాధారణంగా భారత్ తన చమురు అవసరాల కోసం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈలపై ఎక్కువగా ఆధారపడుతుంది. అయితే, హర్మ్యూజ్ జలసంధి గుండా రవాణా కష్టతరం కావడంతో రష్యా నుంచి తక్కువ ధరకే లభించే చమురు భారత్‌కు ఊరటనిస్తోంది. అయితే, గతంలో రష్యన్ చమురుపై ఆంక్షలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయంగా చమురు ధరలను కంట్రోల్ చేసేందుకు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 30 రోజుల పాటు మినహాయింపువ్వగా అది భారత్‌కు పూర్తిగా కలిసొచ్చింది. మార్చి 19న భారత పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, రష్యా డిప్యూటీ ఇంధన మంత్రి పావెల్ సోరోకిన్ మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# పేరుకే ఎంఎస్ఎంఈ పాలసీ!



ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధి విషయంలో ప్రభుత్వ వైఖరి ఆరంభశూరత్వంగా మారింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నూతన పాలసీని ప్రవేశపెట్టి రెండేండ్లు కావాస్తున్నా ఇంతవరకు ఉత్తర్వులు విడుదల చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. చిన్నతరహా యూనిట్లు నెలకొల్పాలనుకునేవారు ప్రభుత్వ ఉత్తర్వులకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంఎస్ఎంఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కొత్త పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించింది. సెప్టెంబర్ 2024లో ఎంఎస్ఎంఈ పాలసీ ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా రాబోయే ఐదేండ్లలో రూ.4వేల కోట్ల పెట్టుబడితో 25వేల కొత్త యూనిట్లు, 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రకటించింది. పరిశ్రమలకు అవసరమైన భూములు, రుణాలు, ముడి సరుకు, సాంకేతికత, నైపుణ్యం, మారెటింగ్ తదితర ఆరు ప్రధాన సవాళ్లను పరిషరించడంపై ఈ పాలసీ దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఇందులో ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన టీ-ఐడియా, టీ-ప్రైడ్ పథకాల్లోని ప్రోత్సహకాలనే కాస్త అటుఇటుగా మార్చి అమలుచేయాలని నిర్ణయించారు. మూలధన పెట్టుబడిపై 25శాతం వరకు సబ్సిడీలు, ప్రత్యేక ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటు, ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల ఏర్పాటు, సిడ్బీతో కలిసి మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను చేర్చారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే భూములకు సంబంధించి గతంలో 33శాతం రాయితీ ఉండగా, కొత్త పాలసీలో దాన్ని 50 శాతానికి పెంచారు.తెలంగాణ పర్యాటకం జీఎస్‌డీపీలో ఎంఎస్ఎంఈల వాటాను 10 శాతం పెంచాలని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, ఈ-కామర్స్ ద్వారా మార్కెట్ అవకాశాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టాటా టెక్నాలజీస్ సౌజన్యంతో రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మార్చడం ద్వారా పరిశ్రమలకు నైపుణ్యం గల సిబ్బందిని అందించాలని నిశ్చయించారు. స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటుచేసి పరిశ్రమలకు నైపుణ్యాలను వృద్ధి చేయాలని నిర్ణయించారు.

**కేంద్ర పథకాలు తమవిగా చెప్పుకుంటున్న సర్కార్**

అయితే, పాలసీకి సంబంధించి ఘనంగా మార్గదర్శకాలు రూపొందించిన ప్రభుత్వం, ఇంతవరకు ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ.. నూతన ఎంఎస్ఎంఈ పాలసీని తెచ్చినట్టు, మార్గదర్శకాలు కూడా రూపొందించినట్టు, త్వరలోనే ఉత్తర్వులు జారీచేస్తామని వెల్లడించింది. అంతేకాకుండా పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఎంఎస్ఎంఈలకు సహకారం అందిస్తున్నట్టు తెలిపింది. పాలసీ ప్రవేశపెట్టి రెండేండ్లు కావస్తున్నా ఇంతవరకు ఉత్తర్వులు జారీచేయకపోగా, కేంద్ర ప్రభుత్వ పథకాలను తాము అమలు చేస్తున్నట్టు చెప్పడం విమర్శలకు తావిస్తున్నది. కొత్త పాలసీ అమల్లోకి వస్తే అదనపు ప్రయోజనాలు పొందవచ్చనే ఉద్దేశంతో చాలామంది పారిశ్రామికవేత్తలు ఎదురుచూస్తున్నారు.

**ఎంఎస్ఎంఈ పాలసీ-2024 ప్రధానాంశాలు..**

ఆర్థిక ప్రోత్సాహకాలు, స్థిర మూలధన పెట్టుబడిపై 25శాతం సబ్సిడీ.

మహిళలు, ఎస్సీ/ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 20శాతం అదనపు సబ్సిడీ.

మౌలిక సదుపాయాలు, ఎంఎస్ఎంఈ పార్‌లు, ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు.

నిధుల లభ్యత, కష్టాల్లో ఉన్న పరిశ్రమలకు మద్దతుగా ప్రత్యేక 'నిధి' ఏర్పాటు.

సిడ్బీతో కలిసి ప్రత్యేక సదుపాయాలు

65 ఐటీఐలను టాటా గ్రూప్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

పరిశ్రమల శాఖలో ప్రత్యేక విభాగం(డెడికేటెడ్ వింగ్), 40 కీలక పారామీటర్లతో నిరంతర పర్యవేక్షణ.

**ముఖ్య లక్ష్యాలు..**

రాష్ట్ర జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా10 శాతం పెంచడం.

స్థానిక తయారీని ప్రోత్సహించడం, ఈ-కామర్స్ ద్వారా మారెట్ అవకాశాలు విస్తరించడం.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఎఫ్‌సీ మరియు సీబీటీఎఫ్‌ల బలోపేతం.

## ట్యాబ్లెట్ పీసీల్లో శాంసంగ్ టాప్..



ముంబై: భారత ట్యాబ్లెట్ పీసీ మార్కెట్ 2025లో వార్షిక ప్రాతిపదికన 2% వృద్ధి సాధించింది. ముఖ్యంగా శాంసంగ్ 31% మార్కెట్ వాటాతో తొలి స్థానంలో నిలవగా.. యాపిల్ 20% వాటాతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. లెనోవో (15%) మూడో స్థానంలో నిలిచిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ఇటీవల విడుదల చేసిన తన నివేదికలో పేర్కొంది. "ప్రముఖ బ్రాండ్లు చేపట్టిన వ్యూహాత్మక ఉత్పత్తి నవీకరణల కారణంగా భారత ట్యాబ్లెట్ మార్కెట్‌లో ప్రీమియం వైపు స్పష్టమైన మార్పు కనిపించింది. రూ.30,000--రూ.40,000 ధర విభాగం అత్యంత వేగంగా పెరుగుతున్న సెగ్మెంట్‌గా మారింది. ఈ విభాగంలో షిప్‌మెంట్‌లు దాదాపు 7 రెట్లు పెరిగాయి. ఇది అత్యాధునిక పనితీరు గల డివైస్‌లపై కస్టమర్లకు పెరుగుతున్న ఆసక్తి సూచిస్తుంది." అని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రధాన అనలిస్ట్ అన్షికా జైన్ తెలిపారు.

**కొనసాగిన శాంసంగ్ హవా:** భారత్ ట్యాబ్లెట్ పీసీ మార్కెట్‌లో గతేడాది కూడా శాంసంగ్ అగ్రస్థానంలోనే కొనసాగింది. ట్యాబ్లెట్ల సరఫరాలు వార్షిక ప్రాతిపదికన 15% వృద్ధితో మార్కెట్ వాటా 2024లో 27% నుంచి 2025లో 31 శాతానికి పెరిగింది. గెలాక్సీ ట్యాబ్ ఏ9 సిరీస్‌కు మంచి డిమాండ్ నెలకొనడం, తరువాత ఏ11 సిరీస్ ప్రవేశంతో వృద్ధి కొనసాగింది. రూ.15,000-రూ.30,000 విభాగంలో శాంసంగ్ తన ఆధిపత్యాన్ని మరింత బలపరిచింది. అలాగే గెలాక్సీ ట్యాబ్ ఎస్ సిరీస్ ద్వారా ప్రీమియం విభాగంలో కూడా తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంది.

**యాపిల్ వాటా స్వల్ప తగ్గుదల:** మార్కెట్ వాటా స్వల్పంగా రెండు శాతం క్షీణించినప్పటికీ యాపిల్ మొత్తం మీద 20 శాతం వాటాతో శాంసంగ్ తర్వాత రెండో స్థానంలో నిలిచింది. రూ.30,000-శ్రీ రూ.40,000 ధర విభాగంలో ఐప్యాడ్ (2025) 128జీబీ మోడల్‌కు మంచి డిమాండ్ ఉండటం గమనార్హం. ఐప్యాడ్ ప్రో సిరీస్‌లో ఓఎల్ఈడీ టెక్నాలజీ వినియోగం పెరగడంతో ప్రీమియం సెగ్మెంట్‌లో కంపెనీ స్థానం బలపడింది. లెనోవో 24% సప్లై వృద్ధితో 15 శాతం మార్కెట్ వాటాను దక్కించుకోగా, షియోమీ 74% షిప్‌మెంట్ పెరు గుదలతో 11% మార్కెట్ వాటాను సాధించింది.

# ఉత్కంఠ పోరు..

## చివరి బంతికి సిక్స్ కొట్టి గెలిచిన సౌతాఫ్రికా




క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా మహిళల మధ్య జరిగిన తొలి వన్డే అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన ఈ పోరులో 2 వికెట్ల తేడాతో సౌతాఫ్రికా విజయం సాధించింది. ప్రోటీస్ విజయంలో యువ ఆల్‌రౌడర్ కైలా రేనెకేది కీలక పాత్ర. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌట్ అయింది. టాపార్డర్ పెద్దగా రాణించకపోయినప్పటికి.. మిడిలార్డర్ బ్యాటర్ మ్యాడీ గ్రీన్ మాత్రం 85 పరుగులతో సత్తాచాటింది. ఆమెతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ ఇసాబెల్లా గేజ్ 37 పరుగులతో రాణించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో అయాబొంగా ఖాకా 6 వికెట్లు పడగొట్టి కివీస్ వెన్ను విరిచింది. ఆమెతో పాటు ట్రయోన్ రెండు, తుమీ సెఖుఖునే, నడైన్ డిక్లార్క్ తలా వికెట్ సాధించారు. అనంతరం 269 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్లు బ్రిట్జ్(0), లారా వోల్వడర్ట్(16) వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేరారు. ఈ సమయంలో అన్నేరీ డెర్క్‌సెన్( 72), సునే లూస్(53) తమ అద్భుత ఇన్నింగ్స్‌లతో జట్టును ఆదుకున్నారు. అయితే వీరిద్దరూ ఔటయ్యాక ప్రోటీస్ మళ్లీ కష్టాల్లో పడింది. ఈ క్రమంలో నడైన్ డిక్లార్క్(39), కైలా రేనెకే(42) జట్టును గెలిపించే బాధ్యతను తమ భుజాన వేసుకున్నారు. డిక్లార్క్ ఔటైనప్పటికి రేనెకే మాత్రం తన పట్టును వీడలేదు. చివరి ఓవర్‌లో ప్రోటీస్ విజయానికి 14 పరుగులు అవసరమయ్యాయి. సుజీ బేట్స్ వేసిన ఈ ఓవర్‌లో తొలి రెండు బంతులకు కేవలం రెండు పరుగులు మాత్రమే ఇచ్చాయి. దీంతో విజయసమీకరణం 4 బంతుల్లో 12 పరుగులగా మారింది. ఆ తర్వాత మూడో బంతికి రేనెకే అద్భుతమైన సిక్సర్ బాదింది. దీంతో మూడు బంతుల్లో 6 పరుగులు అవసరమయ్యాయి. అయితే అనూహ్యంగా తర్వాత రెండు బంతులకు ఎలాంటి పరుగులు రాలేదు. దీంతో సౌతాఫ్రికా విజయానికి ఆఖరి బంతికి సిక్స్ అవసరమైంది. అయితే రేనెకే అద్భుతమైన సిక్స్ బాది ప్రోటీస్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. రేనెకే ఇదే తొలి వన్డే మ్యాచ్ కావడం విశేషం.

## ఎస్ఆర్‌హెచ్‌పై విజయం.. కోహ్లీ ఫ్లయింగ్ కిస్



ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) శుభారంభం చేసింది. శనివారం ఎస్ఆర్‌హెచ్‌తో జరిగిన సీజన్ తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అయితే మ్యాచ్‌లో ఆర్సీబీ విజయం ఖరారు కాగానే స్టేడియంలో అందరినీ ఆకట్టుకునేలా ఒక క్యూట్ 'విరుష్క' మూమెంట్ చోటుచేసుకుంది. గెలుపు ఆనందంలో విరాట్ కోహ్లీ తన హెల్మెట్ తీసి, స్టాండ్స్‌లో తన కోసం ఉత్సాహంగా చీర్ చేస్తున్న భార్య అనుష్క శర్మ వైపు చూస్తూ ముద్దుగా 'ఫ్లయింగ్ కిస్' ఇచ్చాడు. దానికి స్పందనగా అనుష్క కూడా ఏమాత్రం ఆలస్యం చేయకుండా అంతే ప్రేమగా కోహ్లీకి రిటర్న్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చింది. ఈ దృశ్యాన్ని అక్కడే మ్యాచ్ చూడటానికి వచ్చిన ఆర్సీబీ మహిళల జట్టు క్రికెటర్లు స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ నవ్వుతూ ఆశ్చర్యంగా చూశారు. ఈ అందమైన క్షణంతో చిన్నస్వామి స్టేడియం ఒక్కసారిగా అభిమానుల అరుపులతో హోరెత్తిపోయింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు, కెప్టెన్ ఇషాన్ కిషన్ 80 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు చేసింది. అయితే 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉండటంతో ఆర్సీబీ చాలా సులువుగా ఊదేసింది. కేవలం 15.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఆర్సీబీ విజయాన్ని అందుకుంది.

# స్పోర్ట్స్

## తొలి మ్యాచ్‌లోనే చరిత్ర సృష్టించనున్న ముంబై ఇండియన్స్



ఐపీఎల్-2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఆదివారం వాంఖడే వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ ముంబై తలపడనుంది. అయితే ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌కు ఒక అద్భుతమైన మైలు రాయిని అందుకోనుంది. ముంబై జట్టుకు ఇది 300వ టీ20 మ్యాచ్ కావడం గమనార్హం. తద్వారా టీ20 క్రికెట్ చరిత్రలో 300 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీగా ముంబై సరికొత్త రికార్డు సృష్టించనుంది. కాగా ముంబై ఇండియన్స్ ఇప్పటికే ఐపీఎల్ చరిత్రలో తమకంటూ కొన్ని ప్రత్యేక పేజీలను లిఖించుకుంది. ముంబై జట్టు ఈ క్యాష్ రిచ్ లీగ్‌లో ఇప్పటివరకు ఐదు సార్లు ఛాంపియన్స్‌గా నిలిచింది. తద్వారా అత్యధిక సార్లు ఐపీఎల్ టైటిల్ గెలిచిన జట్టుగా సీఎస్‌కేతో కలిసి సంయుక్తంగా ముంబై అగ్రస్థానంలో కొనసాగుతోంది. ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు ఆడిన 299 మ్యాచ్‌లలో 162 విజయాలు నమోదు చేసింది. ఓవరాల్‌గా అత్యధిక టీ20లు ఆడిన జాబితాలో ముంబై ఇండియన్స్ మూడో స్థానంలో నిలిచింది. మొదటి స్దానంలో పాకిస్తాన్(303) ఉండగా, రెండో సోమర్‌సెట్(303) కొనసాగుతోంది.

అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడిన టాప్-5 ఐపీఎల్ జట్లు

ముంబై ఇండియన్స్-299 రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-287


కోల్‌కతా నైట్‌రైడర్స్-281 చెన్నై సూపర్ కింగ్స్-277

ఢిల్లీ క్యాపిటల్స్-274



## లెజెండ్ శరవణనన్ రెండో సినిమా.. తెలుగు ట్రైలర్ చూశారా?

తమిళనాడులో శరవణనన్ స్టోర్స్ అనే వస్త్రదుకాణ యజమానిగా గుర్తింపు తెచ్చుకున్న లెజెండ్ శరవణనన్.. నాలుగేళ్ల క్రితం తన పేరుతోనే తీసిన 'లెజెండ్' సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు. ప్రమోషన్ల టైంలోనే విపరీతంగా ట్రోలింగ్‌కి గురైన ఈ చిత్రం.. థియేటర్లలోకి వచ్చిన తర్వాత అంతకు మించిన విమర్శలు ఎదుర్కొంది. దీంతో ఈ హీరో ఇప్పుడు నాలుగేళ్ల గ్యాప్ తీసుకుని ఈసారి కొత్తగా 'లీడర్' మూవీతో వస్తున్నాడు. ఈ మూవీకి ఆర్ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహించగా.. పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా చేసింది. ఆండ్రియా, శ్యామ్, లాల్ లాంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. జిబ్రాన్ సంగీతమందించాడు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళంలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో యాక్షన్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ భారీతనం కనిపిస్తున్న ఈ మూవీ అయినా శరవణనన్‌కి హిట్ ఇస్తుందేమో చూడాలి?



## 'సైరాట్' దర్శకుడితో విజయ్ వర్మ 'మట్కా కింగ్'.. టీజర్ రిలీజ్

వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ వర్మ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు మేకర్స్ అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ క్రైమ్ డ్రామా సిరీస్ 'మట్కా కింగ్' విడుదలకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియో ఈ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్ కాబోతుండగా.. టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 1960ల నాటి ముంబై నేపథ్యంలో ఈ సిరీస్ తెరకెక్కింది. ఒక సాధారణ కాటన్ ట్రేడర్.. అప్పట్లో ముంబైని షేక్ చేసిన 'మట్కా' సామ్రాజ్యాన్ని ఎలా సృష్టించాడు, ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సిరీస్ రూపొందింది. ఇందులో విజయ్ వర్మ లీడ్ రోల్ పోషిస్తున్నారు. 'సైరాట్' సినిమా డైరెక్టర్ నాగరాజ్ మంజులే ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్ఆర్ఆర్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది.

## ఎమోషనల్ లవ్ స్టోరీ.. అనకాపల్లి టీజర్ చూశారా?



విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ఠ, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో వస్తోన్న చిత్రం అనకాపల్లి. ఈ సినిమాకు తమ్మినేని ఖగేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీకి డైరెక్టర్ నక్కిన త్రినాథరావు కథ అందించారు. మూవీ ప్రమోషన్లలో భాగంగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తాజాగా రిలీజైన అనకాపల్లి టీజర్ చూస్తుంటే ప్రేమకథా చిత్రంగా ఈ మూవీని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రాన్ని భవ్యశ్రీ మూవీ మేకర్స్, నక్కిన నారేటివ్స్ బ్యానర్లపై కంద్రేగుల నాయుడు, నక్కిన త్రినాథరావు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు దేవ్‌జాండ్ సంగీతమందిస్తున్నారు.

## ఇకపై తెలుగులో వరుస సినిమాలు చేస్తా : గోవింద్ వరాహ



ప్రణవ్ రావ్ రాణి, ప్రజక్త గైక్వాడ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా గూగుల్ మై ఫ్రెండ్. ఈ చిత్రాన్ని డాలర్స్ మీడియా అండ్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దివాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. బహు భాషల్లో పలు హిట్ చిత్రాలతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్న గోవింద్ వరాహ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'గూగుల్ మై ఫ్రెండ్' సినిమాకు టి. వెంకటేష్ రెడ్డి, బి.ప్రసన్నాంజనేయులు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, మరాఠీ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, సాయి రాజేశ్, వి సముద్ర, శైలేష్ కొలను, కొండా విజయ్ కుమార్ చేతుల మీదుగా ఈ చిత్ర సాంగ్స్ లాంఛ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సాయిరాజేశ్ మాట్లాడుతూ – 'మా దర్శకుల సంఘం సభ్యులు, మా ఆత్మీయులు గోవింద్ డైరెక్ట్ చేస్తున్న గూగుల్ మై ఫ్రెండ్ మూవీ సాంగ్స్, టీజర్ ఇతర కంటెంట్ చూశాం. ఈ కంటెంట్ అంతా ప్రామిసింగ్ గా ఉంది. ఒకేసారి తెలుగు, మరాఠీ భాషల్లో ఆయన ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు మంచి రిలీజ్ కుదిరి ప్రొడ్యూసర్ కు డబ్బులు, గోవింద్‌కి పేరు రావాలని కోరుకుంటున్నా'అన్నారు. డైరెక్టర్ గోవింద్ వరాహ మాట్లాడుతూ – నేను తెలుగులో బాల, నేను నాన్న అబద్ధం, మనుషులతో జాగ్రత్త వంటి చిత్రాలు రూపొందించాను. మలయాళంలో కొన్ని చిత్రాలు రూపొందించాను. మరాఠీలో ఓ సినిమా తెరకెక్కించాను. తెలుగుతో పాటు ఇతర భాషల్లో గూగుల్ మై ఫ్రెండ్ చిత్రాన్ని రూపొందిస్తున్నాను. తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ కు ఎన్నికైన నా కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ రోజు మా మూవీ సాంగ్స్ రిలీజ్ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఇతర భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగు ఇండస్ట్రీకి దూరమవుతున్నానేమో అనిపించిన టైమ్ లో గూగుల్ మై ఫ్రెండ్ అనే సినిమాను రూపొందిస్తున్నాను. ఇకపైనా తెలుగులో వరుసగా చిత్రాలు చేస్తాను. మా నిర్మాతలు ఇస్తున్న సపోర్ట్ వల్లే వరుసగా సినిమాలు చేయగలుగుతున్నాను. ఈ జర్నీలో నాకు సపోర్ట్ చేస్తున్న నిర్మాతలు ఏఎం రత్నం, కెకె రాధమోహన్, చిట్టూరి శ్రీనివాస్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా'అన్నారు.

## బాలయ్య-గోపీచంద్ మలినేని మూవీలో బోల్డ్ భామ... పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై పెరిగిన అంచనాలు

టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో ఒకటైన నందమూరి బాలకృష్ణ – గోపీచంద్ మలినేని జోడీ మరోసారి కలిసి వస్తుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా అప్డేట్ మరింత హైప్‌ను పెంచుతోంది. ఈ చిత్రంలో బోల్డ్ బ్యూటీ లక్ష్మీ రాయ్ కీలక పాత్రలో నటించనున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఎంపికైన విషయం తెలిసిందే. ఇప్పుడు లక్ష్మీ రాయ్ చేరికతో సినిమాకు గ్లామర్‌తో పాటు కథలో కొత్త మలుపు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, లక్ష్మీ రాయ్ పాత్ర సినిమా సెకండ్ హాఫ్‌లో ఎంట్రీ ఇస్తుందని, కథను మలుపుతిప్పేలా బలమైన ప్రాధాన్యతతో ఉండనుందని తెలుస్తోంది. గతంలో 'అధినాయకుడు' చిత్రంలో బాలకృష్ణతో కలిసి నటించిన లక్ష్మీ రాయ్, మరోసారి ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాను నిర్మాత సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. సంగీత బాధ్యతలను ఎస్ థమన్ నిర్వహిస్తున్నారు. ఇక ఈ సినిమా గురించి దర్శకుడు గోపీచంద్ మలినేని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "గాడ్ ఆఫ్ మాసెస్ ఈజ్ బ్యాక్... ఈసారి మా గర్జన మరింత గట్టిగా ఉంటుంది" అంటూ భారీ అంచనాలు రేకెత్తించారు. బాలకృష్ణతో మరోసారి పని చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఈ చిత్రం చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో 111వ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ సినిమా, కథ, టెక్నికల్ వాల్యూస్, స్టార్ కాస్ట్ అన్నీ కలిసి ఒక భారీ విజువల్ ట్రీట్‌గా ఉండబోతుందని టాక్. మొత్తానికి, లక్ష్మీ రాయ్ ఎంట్రీ వార్తతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## చాలా హాట్‌గా, బోల్డ్‌గా.. కాక్‌టెయిల్ 2పై కృతిసనన్ కామెంట్స్ వైరల్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కృతి సనన్ మహేశ్ బాబు, నాగచైతన్య వంటి లీడింగ్ హీరోలతో నటించిన ఈ బ్యూటీ ప్రస్తుతం హిందీ సినిమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. కృతి సనన్ ప్రస్తుతం కాక్‌టెయిల్ 2 సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న గ్రాండ్‌గా విడుదల కానుంది. మోడ్రన్ లవ్, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో తన పాత్ర తన కెరీర్‌లో ఇప్పటివరకు పోషించనివిధంగా చాలా హాటెస్ట్ అండ్ బోల్డ్‌గా సాగుతుందని చెబుతోంది కృతిసనన్. అంతేకాదు తన రోల్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడం ఖాయమంటోంది. ఈ మూవీలో రష్మిక మందన్నా, షాహిద్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో రష్మిక మందన్నా, కృతిసనన్ పార్ట్‌నర్స్‌గా కనిపించబోతుండగా.. ఈ కాంబో కథనాన్ని ఆసక్తికరంగా సాగేలా చేస్తుందట. తాజా టాక్ ప్రకారం ఈ ఇద్దరు ఫీ మేల్ స్టార్ల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా బోల్డ్‌గా ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై మరో ప్రయోగాత్మక సినిమాతో ప్రేక్షకులను థ్రిల్ అందించడం పక్కా అయిపోయినట్టే. హోమి అడంజనియా డైరెక్ట్ చేస్తున్న కాక్‌టెయిల్ 2 థీమ్, ప్రజెంటేషన్ చాలా బోల్డ్‌గా ఉండబోతుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. డేరింగ్ స్టోరీ లైన్, స్టన్నింగ్ కాంబోలో వస్తున్న రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.



# గ్రామసభలతో ప్రజాపాలన ప్రజలకు చేరువవుతోంది

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా గ్రామసభల నిర్వహణ

## విద్య, వైద్యం, సంక్షేమంతో గ్రామాభివృద్ధి సాధ్యం.. జిల్లా కలెక్టర్ అంకిత్.

**కొత్తగూడెం ఏప్రిల్ 2( స్కై న్యూస్):**ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడమే కాకుండా గ్రామ, వార్డు స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి అవగాహన కల్పించే వేదికగా ఈ గ్రామసభలు ఉపయోగపడతాయని అన్నారు . ముఖ్యంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పింఛన్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను గ్రామ, వార్డు స్థాయిలో విస్తృతంగా వివరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అల్పాహారం వంటి కొత్త పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.క్షేత్రస్థాయిలో పథకాల అమలులో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు, అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.గ్రామాభివృద్ధికి విద్య ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.వైద్య సేవల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.అశ్వాపురం గ్రామంలో అమలు చేసిన పథకాల వివరాలను వెల్లడిస్తూ,రైతు భరోసా కింద 1,369 మందికి రూ. 2.34 కోట్లు, ఇందిరమ్మ ఇళ్ల కింద 58 మందికి రూ. 2.90 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.





మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా రూ. 75.58 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు .గ్యాస్ సబ్సిడీ కింద 1,000 మందికి రూ. 20.11 లక్షలు, చేయూత పింఛన్ల ద్వారా 803 మందికి రూ. 19.33 లక్షలు అందించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 1,156 మంది లబ్ధి పొందినట్లు చెప్పారు.కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ కింద 153 మందికి రూ. 82.09 లక్షలు, 1,235 రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 585.69 లక్షలు, వడ్డీ లేని రుణాలుగా రూ. 28.14 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించి, వాటి అమలుపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు.ఔగ్రామసభల్లో స్థానిక సమస్యలపై చర్చించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి తీర్మానాలు చేయాలని సూచించారు. ఈ వివరాలను ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.గ్రామస్థాయిలో ప్రజల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సవర్లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్, , మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంఈఓ వీరాస్వామి, తాసిల్దార్, అన్ని శాఖల అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి పురస్కరించుకుని పట్టణంలో పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 2 :** హనుమాన్ జయంతి సందర్భంగాషాద్ నగర్ పట్టణం పటేల్ రోడ్‌లోని శివ ఆంజనేయ స్వామి దేవాలయం, జానంపేట అభయాంజనేయ స్వామి దేవాలయం, అలాగే శ్రీనివాస కాలనీ పర్వతాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు అలాగే పటేల్ రోడ్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం భక్తులకు స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావం ఎంతో గొప్పదని పేర్కొంటూ సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా నియోజకవర్గం ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు యువత మంచి మార్గంలో ముందుకు సాగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రాంతం సమగ్ర అభివృద్ధి సాధించాలని హనుమంతుడి ఆశీస్సులు అందరికీ కలగాలని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆకుల శ్రీశైలం, యాదవ చారి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, పట్టణ అధ్యక్షులు నటరాజన్, కౌన్సిలర్లు వసంత



శ్రీనివాస్, శారద శేఖర్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), పిన్నమోని గోపాల్, మాజీ కౌన్సిలర్ వెంకట్రాం రెడ్డి, నాయకులు భిక్షపతి, రాంచందర్, శంకర్, గుండు అశోక్, కావలి భాస్కర్, నవీన్, పవన్ సింగ్, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, ప్రభాకర్, కొంకళ్ళ మణి, వినోద్, పాండు, పిల్లి సాయి, చీపిరి సాయి, సందీప్ సింగ్, శ్రీకాంత్, రాజశేఖర్, శ్రీనివాస్, రఘు, సతీష్, నవీన్, నాని తదితరులు పాల్గొన్నారు.

## యువత ధర్మబద్ధంగా జీవించాలి

**: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 2(స్కైన్యూస్ ):**శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడు, ధర్మస్వరూపుడని , ఆయనకు భక్తుడిగా,సేవకుడిగా తన జీవితాన్ని అంకితం చేసిన హనుమంతుడిని యువత ఆదర్శంగా తీసుకుని అనుసరించాలని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. హనుమాన్ జయంతి సందర్భంగా మహబూబ్ నగరంలోని రాంమందిర్ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ మరియు భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హనుమంతుడు భక్తి, శక్తి, నిస్వార్థ సేవకు ప్రతీక అని కొనియాడారు. శ్రీరాముడి పట్ల అచంచల భక్తితో ధర్మాన్ని కాపాడిన హనుమంతుడి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో విలువలు తగ్గిపోతున్న నేపథ్యంలో యువత ధర్మబద్ధంగా జీవించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ధర్మాన్ని విడవకూడదని, ఎప్పటికైనా ధర్మమే విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. పండుగలు, శోభాయాత్రలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేవిగా ఉండాలని, ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో పాల్గొని విజయవంతం చేయాలని



పిలుపునిచ్చారు. ఈ శోభాయాత్రలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఎస్.శేఖర్, ఎంపి ప్రవీణ్ కుమార్, నాయకులు మున్నూరు రవి, మైత్రి యాదయ్య, లీడర్ రఘు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## గొడుగు గేరి అభయాంజనేయ స్వామి ఆలయానికి 10 తులాల వెండి బహుకరణ

**నారాయణపేట ఏప్రిల్ 02 (స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని గొడుగు గేరి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి బట్టి కృష్ణ కుమారుడు బట్టి శ్రీ కిషన్ పది తులాల వెండిని గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా బహుకరణ చేశారు. శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు పోషల్ వెంకట్ రాములు(9705001009), పూజారి శివానంద్ (7981836129),చేతుల మీదుగా బహుకరణ చేశారు. అంతకంటే ముందు తెల్లవారుజాము నుండి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి, నాగమ్మ మాణిక్యప్ప, గొల్ల రవి , శ్వేతా వెంకటేష్ గౌడ్, లతోపాటు కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు మిర్చి వెంకటయ్య, పళ్ళ గోపాలకృష్ణ, పళ్ళ వెంకట్ రాములు, డబ్బా నారాయణ, కావాలి రాజు, సంజు ప్రకాష్, యాదగిరి నగేష్, పోషల్ నారాయణ, కుంటిమారి నర్సింలు, గొడుగు లక్ష్మణ్, పళ్ళ రవికుమార్ ,శివశంకర్, అశోక్ ,సంతోష్ , పళ్ళ హనుమంతు, పళ్ళ రాజు ,



బొంబాయి బాలాజీ, బి మోహన్ లతోపాటు తదితరులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అయ్యవారిపల్లిలో గ్రామ సభ

**మహబూబ్ నగర్ ఏప్రిల్ 2(స్కైన్యూస్ ):**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జడ్చర్ల మండలంలోని మాచారం గ్రామ పంచాయతీ, మిడ్జిల్ మండలం లోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభల్లో ఉద్యాన శాఖ డి.డి., మహబూబ్ నగర్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. ప్రేమ్ సింగ్ పాల్గొన్నారు. గ్రామ సభలో హాజరైన ప్రజల ను ఉద్దేశించి మాట్లాడుతూ పంటల మార్పిడి విధానాలు, సహజ వ్యవసాయం, రైతు భరోసా మరియు ఉద్యానవన ప్రధాన కార్యక్రమమైన పామాయిల్ సాగు విస్తరణ గురించి వివరించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక యొక్క 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక దృష్ట్యా, నేల ఆరోగ్యం వంటి కొత్త పథకాల గురించి వివరించారు.




## గౌడుల జీవనోపాధిని దెబ్బతీశారు

**తాటి చెట్లను నాశనం చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి**

**గౌడ సంఘం నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ గౌడ్**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 2 :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 22 లో సువర్ణ సంపద వెంచర్ యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు ఏడేళ్లుగా తాటి చెట్లను ధ్వంసం చేసి గౌడుల జీవనోపాధిపై వేటు వేశారన్నారు సువర్ణ సంపద వెంచర్ యాజమాన్యం చెబుతున్నట్లు ఎలాంటి చెక్కులు షాద్నగర్ టిసిఎస్ సొసైటీకి చెందలేదని, ఏడేళ్ల క్రితమే గౌడ సంఘం సభ్యులంతా తాటి చెట్ల నరికివేతకు అడ్డు చెప్పామన్నారు 2019లో తమ పలుకుబడి ఉపయోగించి అనుమతి పత్రాన్ని పొందిన వ్యక్తులు ఆనాటి నుండి అక్కడ తాటి చెట్లను ధ్వంసం చేస్తూనే ఉన్నారని, ఇటీవల మరోసారి సుమారు 50 చెట్లను పూర్తిగా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు తాటి చెట్లను ధ్వంసం చేసిన వారిపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## షాద్ నగర్ పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఏప్రిల్ 2 :** హనుమాన్ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని వివేకానంద కాలనీ, శ్రీనివాస కాలనీ పరిగి రోడ్డులోని గల హనుమాన్ దేవాలయాలలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తాండ్ర విషయాల శ్రావణ్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంతుడు శ్రీరామునికి గొప్ప భక్తుడని, నమ్మకం బలం,ధైర్యానికి ప్రతీకని ఈ పండుగ మనకు భక్తి,వినయం, సేవాభావం నేర్పుతుందని, మనందరం కలిపి జరుపుకునే గొప్ప హిందూ పండుగని అన్నారు ఈ వేడుకలలో మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు అనితా రఘునాథ్ యాదవ్, బిఎస్ సుధీర్, పిల్లి శారద శేఖర్, మహదేవ్పూర్ సర్పంచ్ అనుషారవీందర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, వెంకట్రాంరెడ్డి ఆకుల ప్రదీప్, నాయకులు



అల్లాడ శేఖర్, శివ చారి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సి. ప్రతాప్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఏప్రిల్ 2 :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 12 వార్డు లో కమ్మదానం సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామిని దర్శించుకున్న

**ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**చిన్న చింతకుంట ఏప్రిల్ 2 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం బండర్ పల్లి గ్రామంలో కొలువైన శ్రీ అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ. వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో గురువారం, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.



మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదములు అందజేసి ఆలయ సాంప్రదాయంగా అర్చకులు ఆలయ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137